# కరుణా సంపన్నుడైన దేవుడు

మీరు కూర్చోవచ్చు. నేను_ _ _లోపలికి వస్తూ మరియు ఇక్కడ వేదిక మీద సహోదరుడు మూర్ ను మరియు వారందరినీ చూడటంతో ఉప్పొంగిపోయాను, వారు నాకు ఎన్నో సంవత్సరాలుగా పరిచయమున్న స్నేహితులైయున్నారు. ఈ రాత్రి వారిని ఇక్కడ చూడటం నిశ్చయంగా ఒక భాగ్యమైయున్నది. నా వెనుక అంతటి వేదపండితులు కూర్చొనియుండగా ఇక్కడ నిలబడి మాట్లాడటానికి నేను అల్పునిగా భావిస్తున్నాను, మరియు బహుశా నేను తప్పు చెప్తే వారు నన్ను సరి చేస్తారు. అలా చేస్తారని నేను ఆశపడుతున్నాను.

2 ఈ రాత్రి ఇక్కడ ఒక ప్రత్యేకమైన వ్యక్తిని, సహోదరి రోస్ ను కలిగియున్నందుకు, మేము ఎంతగానో సంతోషిస్తున్నాము. మేము వస్తుండగా_ _ _ఈ రోజు, ఒక చిన్న మధ్యాహ్నపు భోజనం కొరకు నేను, సహోదరుడు షోర్స్ మరియు అతని సహకారునితో ఉన్నాను. మరియు దారిన వస్తున్నప్పుడు, సహోదరి రోస్ చాలా అనారోగ్యంగా ఉందని సహోదరుడు విలియమ్స్ చెప్పాడు. మరియు ఒక్క క్షణం ఆమెను చూడటానికి మేము లోపలికి వెళ్ళి, మోకరించాము. మరి ఆమె తీవ్రమైన జ్వరంతో ఉన్నది, మరియు బాగా జబ్బున పడియున్నది. కేవలం ఒక చిన్న ప్రార్థన చేశాము, మరియు ప్రభువు మాతో మాట్లాడి, మరియు ఇట్లు చెప్పాడు, "ఆమె స్వస్థత పొందుకోబోతున్నది." ఇంకా, "రేపు రాత్రికి ఆమె అక్కడ ఉంటుంది," అని చెప్పాడు. మరియు ఇదిగో ఈ రాత్రి ఆమె, సరిగ్గా ఇక్కడ కూర్చొనియున్నది. అది నిజము.

3 సహోదరి రోస్, ఒక్క నిమిషం లేచి నిలబడు, తద్వారా వారు_ _ _ప్రభువుకు మనము కృతజ్ఞులమైయున్నాము. ఆమె మంచాన పడియున్నది. "ఆ—ఆ దయ్యము నన్ను ప్రతిదానిలోను దెబ్బతీశాడు. నేను ఇక్కడికి వచ్చాను మరియు దీనితో నా ఆరోగ్యం పాడైనది," అని ఆమె చెప్పినది. అది ఏదో ఒక విధమైన గొంతువ్యాధి, మరియు అటువంటిదైయున్నది. కానీ ప్రభువు ఆమెను దానినుండి క్షేమముగా బయటకు తెచ్చాడు, కాబట్టి దాని నిమిత్తము మనము సంతోషిస్తున్నాము. ప్రియమైన ప్రభువునకు కృతజ్ఞతలు చెల్లిస్తున్నాము!

4 ఇప్పుడు మనము అద్భుతమైన సమయాలను కలిగియుంటున్నాము. మరియు ఇప్పుడు, రేపు రాత్రి, మనము ఆ—ఆ రమాడా సత్రమునకు వెళ్తాము. మరియు ఇప్పుడు మర్చిపోకండి, రేపు రాత్రి ఇక్కడ జరగదు, రమాడా సత్రములో జరుగుతుంది. మరియు సమావేశము మరుసటి రాత్రి ప్రారంభమవుతుంది. మీకు తెలుసు కదా, ఇంకొక రాత్రి మీరు నన్ను భరించవలసియుంటుంది.

5 అయితే నిన్న రాత్రి నేను—నేను కొలమాణాన్ని దాటి చాలా ఎక్కువసేపు మాట్లాడాను, సంవత్సరం ప్రారంభంలో, నాకు నేను ఒక చిన్న ప్రమాణములాగా చేసుకున్నాను, అదేమిటంటే నేను ఆ వర్తమానములను మూడు లేదా నాలుగు, ఐదు గంటల నుండి, బహుశా ముప్పై లేదా నలభై నిమిషాలకు తగ్గించబోతున్నాను అనియైయున్నది. మరియు నిన్న రాత్రి నేను మీతో చెప్పినట్లుగా, ఆదివారము నా భార్య, "నీవు చాలా బాగా నిర్వర్తించావు," అని నాతో

చెప్పింది. అయితే——అయితే తర్వాత, అవును, నిన్న రాత్రి నేను వచ్చి దానిని పాడుచేశాను, చూడండి. అయితే నిన్న రాత్రి నేను ముప్పై నిమిషాలకు బదులు, యాభై-ఐదు నిమిషాలు, మాట్లాడాను.

6 ఈ రాత్రి, ఇక్కడికి వస్తుండగా, బిల్లీ ఇట్లడిగాడు, "నీవు దేనిమీద మాట్లాడబోతున్నావు?"

7 నేను ఇట్లు చెప్పాను, "సరి, నేను ఇక్కడ కొన్ని చిన్న వివరణలను, మరియు కొన్ని లేఖనములను వ్రాసుకున్నాను. నాకు తెలియదు, వాటిలో కొన్ని, నాలుగు లేదా ఐదు భిన్నమైన వర్తమానములైయున్నవి." నేను ఇట్లు చెప్పాను, "నేను అక్కడికి వెళ్ళి, మరియు ఏమి జరుగుతున్నదో చూసినప్పుడు నేను నిర్ణయించుకుంటాను."

8 అతడిట్లన్నాడు, "అనారోగ్యముతో ఉన్న ఆ ప్రజలందరి కొరకు ప్రార్థిస్తావని నీవు ప్రమాణము చేశావు."

నేను ఇట్లన్నాను, "అవును, అయ్యా. నీ దగ్గర ఎన్ని కార్డులు ఉన్నాయి?"

"రెండు వందలు," అని చెప్పాడు.

"ఈ రాత్రే నేను మొదలుపెట్టడం మంచిది," అని నేనన్నాను.

9 మరియు అతడు ఇట్లన్నాడు, "ఇప్పుడు గుర్తుంచుకో, మాట్లాడటానికి నీకు పదిహేను నిమిషాలే ఉంటాయి." ఇట్లన్నాడు, "ఆ మిగతా సమయమునంతా నీవు నిన్న రాత్రే తీసుకున్నావు." మనం త్వరపడవలసియున్నది, అవును కదా?

10 మంచిది, ప్రార్థనా కార్డులు కలిగియున్న ప్రజలకు మేము ప్రార్థన చేస్తామని, మేము మీకు ఒక వాగ్దానము చేశాము, మరియు అవును, ఒక వాగ్దానమునకు మేము——మేము బద్ధులమైయున్నాము. మనం ఈ వరుసలగుండా వారందరినీ తీసుకురాలేము, మరియు నేను కూడా బయట జనసమూహము నుండి, వారిని ఒక్కొక్కరిగా పిలువలేను. పరిశుద్ధాత్మ దానిని నాకు ఇచ్చినా కూడా, దానిని చేయడానికి నేను——నేను అసలు తట్టుకోలేను. అది నాకు చాలా భారంగా ఉంటుంది. మరియు, అయితే మనమందరము ఆ విషయాలతో పరిచయం కలిగియున్నాము. దేవుడు ఇంకను దేవుడేయైయున్నాడని మనకు తెలుసు. స్వస్థపరిచేది అది కాదు. అది కేవలం మన విశ్వాసాన్ని బలపరచడానికి, మనము ఆయన సన్నిధిలో ఉన్నామని తెలియజేయడానికి ఇవ్వబడినది.

11 మరియు ఈ రాత్రి, మేము, అనారోగ్యముతో ఉన్న ఆ ప్రజలందరి కొరకు ప్రార్థించబోతున్నాము, ప్రార్థన చేపించుకోడానికి, ప్రార్థనా కార్డులను కలిగియున్న ప్రతియొక్కరి కొరకు ప్రార్థించబోతున్నాము. మరియు పిదప రేపు రాత్రికి, అక్కడ రమాడా సత్రములో, మేము మరికొన్ని ఇచ్చి మరియు అక్కడ వారి కొరకు ప్రార్థించడానికి ప్రయత్నిస్తాము, ఎందుకంటే నాకు రేపు రాత్రి కూడా ఉన్నది. మరియు సమావేశములో ఒక రాత్రి, బహుశా అల్పాహార సమయము కూడా నాకు ఉన్నదని నేను అనుకుంటున్నాను. అది పరిస్థితులు ఎలా జరుగుతాయి అనేదాని మీద ఆధారపడియుంటుంది.

12 కొందరు, ప్రసంగికులలో ఒకరు అసలు రాలేదు; ఇప్పటి వరకైతే రాలేదు, వచ్చాడని నేను అనుకోవడంలేదు. సహోదరుడు హంబర్గ్, లేదా అది...[ఒక

సహోదరుడు ఇట్లు చెప్తున్నాడు, "యాంబర్గీ."—సంపా.] యాంబర్గీ, యాంబర్గీ, క్యాష్ యాంబర్గీ. కాబట్టి నేను—నేను దానినంతా తప్పుగా పలుకుతాను, అది ఆ జర్మను పేరైయున్నది. అది జర్మనీ పేరు అని నేను—నేను అనుకుంటున్నాను. కాబట్టి నేను ఒక విధంగా, మనం దానిని చెప్పే విధంగా, పించ్-హిట్ అనగా అతని స్థానమును నేను తీసుకోవలసియుంటుంది, ఆ మాటకు నన్ను మన్నించండి.

13 కావున ఏదేమైనా, ప్రభువునందు మనము అద్భుతమైన సమయాన్ని కలిగియుంటున్నాము. మీ అందరికీ చెప్తున్నాను, ఈ రాత్రి ఇక్కడ కొందరు క్రొత్తవారు ఉన్నట్లైతే, మిమ్మల్ని కలిగియున్నందుకు మేము ఎంతగానో సంతోషిస్తున్నాము, మరియు ప్రభువు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడని నమ్ముతున్నాను. ఈ రాత్రి మనము ఇక్కడినుండి వెళ్ళేటప్పుడు, భవనంలో వ్యాధిగ్రస్థులెవ్వరూ ఉండకూడదని, ప్రభువు ఆయనయొక్క గొప్ప శక్తితో దిగివచ్చి వ్యాధిబాధలతో ఉన్నవారందరినీ స్వస్థతపరచాలని నేను ప్రార్థిస్తున్నాను.

14 ఇక్కడ కొంత కాలం క్రితం, బహిరంగముగా పరిష్కరించలేని కొన్ని క్లిష్టమైనవాటి కొరకు, వ్యక్తిగతంగా మాట్లాడటానికి ప్రజలను లోపలికి రానిచ్చేవాణ్ణి. పిదప అది ఎంతో త్వరగా ఎదిగినది, అది ఎక్కడిదాకా వచ్చిందంటే, ప్రభువు దానిని ఆశీర్వదించడంతో, మూడు లేదా నాలుగు వందలమంది వేచియుండాల్సిన పరిస్థితికి అది వచ్చినది, మరియు కావున పిదప వారు వేచియుండాల్సివచ్చేది గనుక ప్రజల మనస్సు నొచ్చుకునేది. బహుశా, ఆ పరిస్థితిలో, తమ వంతు రావడానికి, ఒకటి లేదా రెండు సంవత్సరాలు వేచియుండాల్సివచ్చేది, చూడండి, కేవలం కూటముల మధ్యలో, వ్యక్తిగత ఇంటర్వ్యూల కొరకు వారిని తీసుకోడానికి అంత సమయం పట్టేది. మరియు సరిగ్గా ఆ విషయమేమిటో ప్రభువు మాతో చెప్పేవరకు మేము కేవలం కూర్చొని ఆయన కొరకు వేచియుండేవారము.

15 ఈ రాత్రి ఇక్కడ కూర్చున్నవారిలో అలా ప్రత్యేక ఇంటర్వ్యూలకు వచ్చినవారు ఉంటారనుటలో ఎటువంటి సందేహము లేదు. ఉన్నారా? మీ చేతులు పైకెత్తడాన్ని చూద్దాము. ప్రత్యేక ఇంటర్వ్యూలకు వచ్చినవారు. అవును, అక్కడ కూర్చొనియున్నారు, కాబట్టి, మరి అది నిజమని ఎరిగియున్నారు. ప్రభువు ఏమి చెప్తాడో, ఆ విషయము ఏమిటో చూడటానికి మేము వేచియుండేవారము... మరియు తర్వాత నేను ఇక్కడ కొంతకాలం క్రితం దానిని ఆపివేయాల్సివచ్చినది. మనమిక ఎంతమాత్రమూ వ్యక్తిగత ఇంటర్వ్యూలను కలిగియుండలేమని నేను బిల్లీతో చెప్పాను.

16 చూడండి, ఈ మధ్యనే, నేను—నేను—నేను ఇరవై-ఐదవ సంవత్సరమును రెండవసారి దాటాను, మరియు మూడవసారి దాటడానికి సాగిపోతున్నాను. మరియు కావున మీరు వృద్ధులగుచున్నాకొద్దీ, అంతెందుకు, మీరు, మీరు... మీరు ఇదివరకు చేసినట్లు చేయలేరు. మీరు చిన్న చిన్న అడుగులు వేస్తుంటారు. మరియు—మరియు, అవును, సహోదరుడు మూర్ కి ఇంకను దాని గురించి ఏమియు తెలియదు. అతడు...మేము దాదాపు ఒకే వయస్సు గలవారమని నేను అనుకుంటున్నాను.

17 అయితే సహోదరుడు ఔట్లా మరియు సహోదరుడు గార్సియా, మరియు సహోదరుడు ఫులర్ తో కలిసి, నువ్వు మరియు నేను మరియు సహోదరుడు బ్రౌన్

ఇక్కడికి వచ్చినప్పటినుండి, ఎంతో కాలం గడిచిపోయినది. ఈ రాత్రి వారు ఇక్కడ ఉన్నారా అని నేను ఆశ్చర్యపోతున్నాను? సహోదరుడు గార్సియా, సహోదరుడు ఫులర్, సహోదరుడు ఔట్లా, వారు ఇక్కడున్నారా? మీరు ఇక్కడున్నట్లైతే మీ చేతులను పైకెత్తండి. అవును, నేను పొరపడనట్లైతే, సహోదరుడు ఫులర్, ఉన్నాడని నేను నమ్ముతున్నాను. సహోదరుడు ఔట్లా ఇక్కడున్నాడు. సహోదరుడు గార్సియా, అతడు ఫీనిక్సు నుండి బయలుదేరాడని నేను——నేను అనుకుంటున్నాను. అది నిజమని నేను అనుకుంటున్నాను. అతడు——అతడు ఫీనిక్సు నుండి వెళ్ళిపోయాడు, మరియు అతడు కాలిఫోర్నియాలో ఉన్నాడు. సరి, అవి నిశ్చయంగా ఘనమైన దినములైయున్నవి, మరియు నేను ఇంకను అప్పుడు నేను కలిగియున్న అదే వర్తమానమును నమ్ముతున్నాను, "యేసుక్రీస్తు నిన్నా, నేడు, మరియు నిరంతరము ఒక్కటేరీతిగా ఉన్నాడు." అది దాదాపు...సరి, బెక్కీ ఒక చిన్నబిడ్డగా ఉన్నప్పుడైయున్నది. అది దాదాపు పంతొమ్మిది సంవత్సరాల క్రితమైయున్నది.

18 మరి ఇప్పుడు ఆమె పెద్దగా, లావుగా, వికారంగా ఉన్న, పంతొమ్మిది సంవత్సరాల వయస్సుగల అమ్మాయియైయున్నది, బయట అక్కడే ఎక్కడో కూర్చొనియున్నది. బెక్కీ, నీవు ఎక్కడ ఉన్నావు? అబ్బాయ్, ఆ విధంగా అన్నందుకు ఆమె నన్ను వదిలిపెట్టదు. ఆమెను నా చేతుల్లో ఎత్తుకోవడం నాకు జ్ఞాపకమున్నది. ఈ రాత్రి నేను దానిని చేయాలంటే కొంచెం కష్టమే.

19 ఒక రాత్రి గార్సియా సహోదరుని సంఘము వద్ద జరిగినది నాకు గుర్తున్నది, ఆమె ఒక చిన్న పాపగా ఉన్నది. మరియు నేను ఇట్లన్నాను, "ఈ రాత్రి మనకు ఒక అంతర్జాతీయ కూడిక ఉన్నది." నేను ఇట్లన్నాను, "నేను స్పానిష్ వారితో మాట్లాడుతున్నాను." నేనింకా ఇట్లన్నాను, "ఇక్కడున్న నా భార్య జర్మనీ వంశానికి చెందినది." నేను ఇట్లన్నాను, "నేను ఐరిష్ వంశానికి చెందినవాడను." మరియు నేను ఇట్లన్నాను, "నా చిన్న అమ్మాయి ఇండియన్ అయ్యున్నది," మరి అది బెక్కీయైయున్నది.

20 కావున నేను ఆ వెనుక ద్వారము నుండి బయటకు వెళ్ళినప్పుడు, బయట అక్కడ ఒక చిన్న మెక్సికన్ అమ్మాయి ఉన్నది, "సహోదరుడా బ్రెన్హామ్!" అని అన్నది.

అందుకు నేనిట్లన్నాను, "హా, ప్రియా, నీకు ఏమి కావాలి?"

ఇట్లన్నది, "మీ పాపను ఒక ఇండియన్ అనడానికి ఆమె కొంచెం ఎక్కువ తెల్లగా ఉందని మీరనుకోవడంలేదా?" ఆమెకు బంగారువర్ణపు తలవెంట్రుకలు ఉంటాయి, మీకు తెలుసు కదా.

మరియు నేను ఇట్లన్నాను, "కేవలం చేష్టలలో ఇండియన్ అయ్యున్నది."

21 సరి, ఈ రాత్రి, మరలా ఇక్కడ ఉండటానికి, మనము కృతజ్ఞులమైయున్నాము. ఇప్పుడు మనము వాక్యమును సమీపించడానికిముందు, మనము ఆయనను సమీపించుదాము, ఏలయనగా ఆయన వాక్యమైయున్నాడు. వాక్యము ప్రత్యక్షపరచబడినప్పుడు, అది ఆయన మీలో ఉండుటయైయున్నది.

22 నిన్న రాత్రి మనము బేధమైన విత్తనముపై మాట్లాడుకున్నప్పుడు, మీరు దానిని, ప్రభువుయొక్క ఆశీర్వాదమును అభినందించారా? ఆ వర్తమానమును

మీకు అందించడాన్ని నేను——నేను ఖచ్చితంగా అభినందించాను. మరియు ఆ విత్తనాలు ఏమిటో మనం చూశాము.

23 ఇప్పుడు ఈ రాత్రి ఒక ప్రత్యేకమైన విన్నపము ఉన్నదా, ఏదైనా ఒక ప్రత్యేకమైన విన్నపము ఉన్నదా? బహుశా ఈ ప్రార్థనా వరుసలో నిలబడబోవుచున్న మీలో కొందరు, ఇట్లు చెప్పండి, "దేవా, నా యెడల కనికరము చూపుము. నేను ప్రార్థన చేపించుకోడానికి వచ్చినప్పుడు, పరిస్థితులను ఎదుర్కొనేటట్లు నా విశ్వాసమును పెంచుము." మరియు——మరియు బహుశా మీ ప్రియులెవరైనా, వ్యాధితోనైనా, మరిదేనితోనైనా ఉండవచ్చును. దేవుడు క్రిందికి చూసి మరియు ఈ విధంగా చెప్పునట్లు మీరు మీ చెయ్యిని పైకెత్తుతారా...ఇప్పుడు అది...దానిని చూడటానికి నాకు ఎలా అనిపిస్తుందో మీకు తెలియదు. అసలు ఇక్కడున్న అవసరతను చూడండి! సేవకులైన సహోదరులారా, కేవలం దానిని చూడండి. చూశారా? ఇప్పుడు, అది నాకే ఆ విధంగా అనిపించేటట్లు చేస్తే, మన తండ్రికి అది ఏమి చేస్తుంది? ఖచ్చితంగా.

ఇప్పుడు మనము ప్రార్థించుకుందాము.

24 ప్రియమైన యేసూ, అన్నిటికి చాలిన ఈ నామము ద్వారా, మేము ఇప్పుడు ఆ ఘనమైన కరుణా సింహాసమును సమీపిస్తున్నాము. "ఏలయనగా మనుషులలో ఇయ్యబడిన మరి ఏ నామమున మేము రక్షణ పొందలేము గానీ, ప్రభువైన యేసు అను ఈ నామమున మాత్రమే పొందగలము." మరియు మేము ఆయన నామములో వస్తున్నాము. మరియు పరలోకపు తండ్రీ, నీయొక్క విశ్వసించే పిల్లలుగా, ఈ రాత్రి, నీవు మమ్మల్ని స్వీకరిస్తావని మేము ప్రార్థిస్తున్నాము. మరియు ప్రభువా, మా అవిశ్వాసమును క్షమించుము. మాకు అవసరమున్న ప్రతిదాని కొరకు, మేము దేవునియొక్క ప్రతీ మాటను పూర్తిగా నమ్మునట్లు, ఈ రాత్రి మాకు సహాయము చేయుము.

25 పైకెత్తబడిన ఈ హస్తముల క్రింద ఏమున్నదో నీకు తెలుసు; వ్యాధి ఉన్నది, వారిలో కొందరికి కుంటుంబ సమస్యలు ఉండవచ్చును, కొందరికి ఆర్థిక ఇబ్బందులు ఉండవచ్చును, కొందరు అలసిపోయియుండవచ్చును, కొందరు భక్తి విడిచియుండవచ్చును, కొందరు పాపులైయుండవచ్చును. అవసరము ఏదైనా గానీ, నీవు ఎటువంటి శత్రువుకంటెను గొప్పవాడివైయున్నావు. కావున ప్రభువా, ఆ——ఆ రాత్రి, మా శత్రువులు, ప్రతీ ఒక్కరూ, చివరకి మరణము సైతం ఓడించబడినదని, మేము గుర్తించాలని మేము ప్రార్థిస్తున్నాము. మరియు మమ్మల్ని ప్రేమించి మా కొరకు తననుతాను అప్పగించుకొని, తన రక్తములో మమ్మల్ని కడిగిన ఆయనలో మేము జయశీలులకంటే ఎక్కువైనవారమని గుర్తించాలని ప్రార్థిస్తున్నాము.

26 ప్రభువా, సమస్త అవిశ్వాసము, సమస్త సందేహము, సమస్తమైన చిరాకు, దేవునివంటిది కానీ ప్రతీది, ఈ రాత్రి మా నుండి ఎగిరిపోవాలని మేము ప్రార్థిస్తున్నాము, తద్వారా పరిశుద్ధాత్మ మా హృదయాలలోనికి వచ్చే అధికారమును కలిగియుండుటకైయున్నది. మర్మయుక్తమైన మార్గములలో ఆయన మాతో మాట్లాడును గాక. ఆయన తనయొక్క శక్తిలో మాతో మాట్లాడును గాక. ఆత్మసంబంధముగా మరణించియున్నవారిని ఆయన పునరుద్ధరించును గాక, వ్యాధి బాధలతో ఉన్నవారికి తిరిగి ఆరోగ్యమును దయచేయును గాక, తొట్రిల్లిన

మోక్కాళ్ళను, సడలిన చేతులను పైకి లేపును గాక. మరియు ఒక సంతోషకరమైన సమయము ఉండును గాక.

27 ప్రభువా, ఈ స్థలము విడిచి రమాడా సత్రమునకు వెళ్ళి, పట్టణములో నిర్వహించబడినట్టి గొప్ప సమావేశములలో ఒకదానిని ప్రారంభించుటకు ఈ రాత్రి అది బ్రద్దలై బయలుదేరును గాక. ప్రభువా, మేము కూడివచ్చి మరియు ప్రార్థిస్తుండగా! మరి, "నా పేరు పెట్టబడిన జనులు, కూడుకొని మరియు ప్రార్థనచేసినట్లైతే, అప్పుడు నేను ఆకాశమునుండి ఆలకిస్తాను" అని నీవు చెప్పావు. దేవా, ఈ రాత్రి, ఇది ఆ విధంగానే ఉంటుందని మేము ప్రార్థిస్తున్నాము.

28 ఇప్పుడు, తండ్రీ, మేము వాక్యమును చదువుతుండగా, నీవు గాక వేరెవ్వరూ దానిని అనువదించలేరు, నీవే నీ స్వంత అనువాదకుడవైయున్నావు, మరియు ఈ రాత్రి మేము చదివిన సంగతులను నీవు మాకు అనువదిస్తావని మేము ప్రార్థిస్తున్నాము. ఏలయనగా యేసు నామములో మేము దానిని అడుగుతున్నాము. ఆమేన్.

29 ఇప్పుడు, ఒక సేవకుడు చదివే లేఖనములను వ్రాసుకోడానికి మీలో చాలామంది ఇష్టపడతారు, మరి ఈ రాత్రి, మీరు తెరవాలనుకుంటే, మీరు ఎఫెసీ పత్రికను తెరవాలని నేను కోరుతున్నాను.

30 మరియు పోయిన ఆదివారము నేను ఎఫెసీ పత్రిక మీద మాట్లాడుతున్నాను, యెహోషువా గ్రంథము ఏ విధంగా పాతనిబంధనయొక్క ఎఫెసీ పత్రికయైయున్నదో చెప్పాను, మరియు ఏ విధంగా అది విమోచనా గ్రంథమైయున్నదో చెప్పాను.

31 మరియు విమోచన రెండు భిన్నమైన భాగములను కలిగియున్నది: "బయటకు రావడం" మరియు "లోపలికి ప్రవేశించడం." మొదటిగా, మీరు బయటకు రావాలి. కొందరైతే తమతోపాటు లోకాన్ని కూడా లోపలికి తెచ్చుకోవాలనుకుంటారు; కానీ క్రీస్తులోకి ప్రవేశించడానికి, నీవు లోకమునుండి బయటకు రావలసియున్నది. విశ్వాసములోనికి ప్రవేశించడానికి, నీవు అవిశ్వాసమునుండి బయటకు రావలసియున్నది. నీ మార్గములో ఒక్కటి కూడా ఉండటానికి వీలులేదు. నిజంగా అసలైన విశ్వాసమును కలిగియుండటానికి, విశ్వాసములోనికి ప్రవేశించడానికి, దేవుని వాక్యమునకు వ్యతిరేకమైన ప్రతిదానిని నీవు పూర్తిగా వదిలిపెట్టవలసియున్నది.

32 మరియు అది, అనగా యెహోషువ గ్రంథము పాత నిబంధనయొక్క ఎఫెసీ పత్రికయైయున్నది. అక్కడ, మోషే ధర్మశాస్త్రమునకు పోలికగా ఉన్నాడు, అది ఏ ఒక్కరినీ రక్షించలేకయున్నది; అయితే కృప రక్షించగలదు, మరియు ఇక్కడ యెహోషువ అనే పదము యేసు అనే పదము వంటిదే, "యెహోవా-రక్షకుడు."

33 మరియు పిదప ఇప్పుడు, మనము మరొక ఎఫెసీ వద్దకు వచ్చామని మనము కనుగొంటాము, ఇప్పుడు మరొక ఎఫెసు. ఇక్కడ, మన మేధస్సంబంధమైన సంఘశాఖలు మరియు మొదలగునవి, మరియు మన విద్యా కార్యక్రమాలన్నీ వాటియొక్క——వాటియొక్క యొర్దాను వద్దకు వచ్చియుండగా, అటువంటప్పుడు మనం మరలా ఒక——ఒక ఎఫెసును కలిగియుండవలసి యున్నాము. మనము

“బయటకు వచ్చి” మరియు ఎత్తబడుట కొరకు “లోపలికి వెళ్ళడానికి” ఒక నిర్గమమును కలిగియుండవలసియున్నాము.

34 ఇప్పుడు ఈ రాత్రి మనము ఎఫెసీ పత్రిక 2వ అధ్యాయము నుండి చదవబోతున్నాము. మీరు ఆ చోటును, లేదా ఆ అధ్యాయమును తీయగలుగుటకు నేను దానిని చెప్తూ ఉన్నాను.

> *మీరు, మీ అపరాధములచేతను పాపము చేతను చచ్చినవారైయుండగా, ఆయన మిమ్మల్ని పురిగొల్పెను:*
>
> *మీరు వాటిని చేయుచు వాయుమండల సంబంధమైన అధిపతిని అనగా, అవిధేయులైన పిల్లలను ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతిని అనుసరించి, ఈ ప్రపంచధర్మము చొప్పున గడిచిన కాలములో నడుచుకొంటిరి:*
>
> *వారితో కలిసి మనమందరమును శరీరము యొక్కయు మనస్సు యొక్కయు కోరికలను నెరవేర్చుకొనుచు, మన శరీర ఆశను అనుసరించి మునుపు ప్రవర్తించుచు కడమవారివలెనే స్వభావ సిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమైయుంటిమి.*
>
> *కానీ దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, మనము మన పాపము చేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము,*
>
> *మన యెడల చూపిన తన మహా ప్రేమచేత, ఆయన మనలను ఆయనతో కూడ పురిగొల్పెను, లేదా, మనలను క్రీస్తుతో కూడ పురిగొల్పెను, (కృప చేతనే మీరు రక్షించబడియున్నారు;)*

35 అందులో నుండి నేను కొన్నిటిని, లేదా ఆ వచనములోని ఒక భాగమును తీసుకొనగోరుతున్నాను, “కానీ దేవుడు,” *కరుణా సంపన్నుడైన దేవుడు.*

36 మీరు ఇక్కడ ప్రవక్తయైన, లేదా, అపొస్తలుడైన పౌలును గమనించాలని నేను కోరుతున్నాను, అతడు——అతడు, అతడు దీనిని ఎలా ప్రస్తావించాడో గమనించండి, ఎలా అన్నాడో గమనించండి, “మునుపు చచ్చినవారైన మిమ్మల్ని, ఆయన పురిగొల్పాడు. మునుపు చచ్చినవారైన మిమ్మల్ని, ఆయన పురిగొల్పాడు, లోకపు సంగతులను అనుసరించి నడుచుకుంటూ; శరీరముయొక్క కోరికను, మనస్సుయొక్క కోరికను నెరవేర్చుకుంటూ, పాపములోను అపరాధములలోను చచ్చినవారైన మిమ్మల్ని పురిగొల్పాడు. ఆ..."

37 ఈ మార్పును కలుగజేసినది ఏమిటి, మీరు చూశారా? “ఒక సమయమున చచ్చినవారైయుండి,” పిదప పురిగొల్పబడిన స్థితికి, ఈ మార్పును కలుగజేసినది ఏమిటి? *పురిగొల్పబడుట* అంటే “జీవింపజేయబడుట” అని అర్థం. మరణము నుండి జీవములోనికి, ఒక మార్పు జరిగినది. ఏ వ్యక్తికైనా సరే, తనను మరణములో నుండి జీవములోనికి మార్చడంకంటే, సంభవించగల గొప్ప విషయము మరొకటి లేదు. ఒక మనుష్యుడు, అతడు భౌతికముగా, మరణించబోతూ, మరియు భౌతికంగా స్వస్థపరచబడితే, అది ఒక గొప్ప విషయముగానే ఉంటుంది, కానీ అతడు ఆత్మసంబంధముగా మరణించియుండగా దేవుడు అతణ్ణి జీవములోనికి పురిగొల్పడమంతటి గొప్ప విషయం ఏదియు లేదు.

38 “మీరు ఒకప్పుడు, గడిచిన కాలములో, చచ్చినవారైయుండగా.” మీరు చచ్చినవారైయున్నారు. ఈ రాత్రి ఇక్కడున్న అనేకమంది కూడా, వెనుకకు చూసి మరియు ఒకప్పుడు మీరు చచ్చినవారైయున్నారని తెలుసుకోగలరు. కానీ అప్పుడున్నట్లుగా, ఈ రాత్రి మీరెందుకని చచ్చినవారిగా లేరు? మీరు ఒక పాపియైయున్నారు గనుక, మీరు ఆ విధంగా ఉండటం తగినదైయున్నది, “కానీ కరుణా సంపన్నుడైన దేవుడు.” విషయం అదే——అదేయైయున్నది, “సంపన్నుడైన దేవుడు.” మనము ఇటువంటివన్నీ అయ్యున్నాము, “కానీ దేవుడు!” సరిగ్గా అదే మార్పును కలుగజేసినది, “కరుణా సంపన్నుడైన దేవుడు!”

39 ఓ, దానిని బట్టి, అనగా ఆయన కరుణా సంపన్నుడై యుండుటను బట్టి నేను ఎంతగానో ఆనందిస్తున్నాను. ఆయన కేవలం ధనములో సంపన్నుడైతే, ఆయన కేవలం వసతులలో సంపన్నుడైతే, మరి ఆయన వాటిలో సంపన్నుడైయున్నాడు, కానీ అయినను కరుణలో సంపన్నుడైయుండటమే అత్యంత గొప్ప విషయమైయున్నది. ఓ, అది ఎంత గొప్ప మాట కదా, ఒక్కప్పుడు మనము ఏ విధంగా చచ్చినవారమైయున్నాము కదా.

40 మరియు మొన్న రాత్రి మనము ఒక విత్తనము ఏ విధంగా చనిపోవలసియున్నది అనేదానిపై మాట్లాడుకుంటున్నాము. మరియు ఆ జీవకణం చుట్టూ ఉన్న ప్రతీది చనిపోవడం మాత్రమే కాదు గానీ, అది కుళ్ళిపోవలసియున్నది. అది కుళ్ళిపోనట్లైతే, అది జీవించలేదు. మరియు కుళ్ళిపోవడం అంటే, “పూర్తిగా ముగిసిపోవడమైయున్నది; దాని పని అయిపోయినది.” మరియు మన స్వంత ఉపాయములు మరియు మన స్వంత ఆలోచనలు పూర్తిగా తొలగిపోయి మరియు అవి మననుండి కుళ్ళిపోయినప్పుడు, అప్పుడు జీవపు కణము జీవించడం మొదలుపెట్టగలుగుతుంది.

41 ఇప్పుడు——ఇప్పుడు మనము, నేను ఇక్కడ కొంచెం బోధనను జొప్పింపబోతున్నాను, తద్వారా నేను...మీరు దానిని నమ్మకపోతే, పర్వాలేదు. అది పర్వాలేదు. నేనైతే దానిని నమ్ముతున్నాను. ఒక మనుష్యుడు, అతడు ఈ లోకంలో జన్మించినప్పుడు, అనగా మీరు ఈ లోకంలో జన్మించి, ఒక చిన్న బిడ్డయైయున్నప్పుడు, దేవుని ముందుజ్ఞానములో లేకుండా మీరు ఇక్కడ ఉండియుండేవారు కాదు, ఎందుకంటే ఆయన పరిమితులు లేనివాడైయున్నాడు మరియు ఆయన సమస్త విషయాలను ఎరిగియున్నాడు. మరియు ఆ చిన్న బిడ్డ ఈ లోకంలో జన్మించినప్పుడు, ఆ బిడ్డలో ఏదో విషయం ఉన్నది. అతడు గనుక ఎన్నడైనా జీవమును కలిగియుండబోతున్నాడంటే, అప్పుడు ఆ లోపల, ఆ బిడ్డలో ఏదో చిన్నది ఉన్నది, అతడు త్వరగానో ఆలస్యంగానో, దానిని గుర్తిస్తాడు. ఆ చిన్న విత్తనము అతనిలో ఉన్నది. ఇప్పుడు మీరు గనుక...లేఖనములు దానిని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

42 ఇప్పుడు ఈ రాత్రి మీరు గనుక నిత్యజీవమును కలిగియున్నట్లైతే, మనము నిత్యజీవమును కలిగియున్నట్లైతే, అలాగైతే మనము ఎల్లప్పుడూ ఉండియున్నాము, ఎందుకంటే ఒకే ఒక్క విధమైన నిత్యజీవము ఉన్నది. మనము ఎల్లప్పుడూ ఉండియున్నాము. మరియు మనము ఉండియుండటానికి కారణమేమిటంటే, మనము దేవునిలో భాగమైయున్నాము గనుకనైయున్నది. మరియు నిత్యమైన ఒకే ఒక్కటి దేవుడేయైయున్నాడు.

43 మరియు ఎలాగంటే మెల్కీసెదెకు అబ్రాహాము నుండి దశమభాగములను స్వీకరించాడు, మరి అది అతని మునిమనుమడైన లేవీకి వర్తించబడినది, అతడు అప్పటికింకా అబ్రాహాము నడుములో ఉండగనే; దశమభాగములు చెల్లించాడు, ఏలయనగా అబ్రాహాము మెల్కీసెదెకును కలిసినప్పుడు అతడు అప్పటికి అతని నడుములో ఉన్నాడు. ఒక ఉదయమున, నేను దాని గురించి మరొక చోట మాట్లాడగోరుతున్నాను. *ఈ మెల్కీసెదెకు ఎవరు?* ఇప్పుడు దానిని గమనించండి. ఆ వెనుక, ఈ అబ్బాయి వస్తున్నాడని దేవుడు ఎరిగియున్నాడు. ఆయన సమస్తమును ఎరిగియున్నాడు.

44 ఇప్పుడు మనం దేవునిలో ఒక భాగమైయున్నాము. మీరు ఎల్లప్పుడూ భాగమైయున్నారు. మీరు దేవునిలో ఒక గుణలక్షణము మాత్రమేయైయున్నారు గనుక, మీకు అది జ్ఞాపకము లేదు. మీరు ఆయన తలంపులలో మాత్రమే ఉన్నారు. మీ స్వంత పేరు సైతం, అది గనుక ఎన్నడైనా జీవగ్రంథములో పెట్టబడినట్లైతే, అది జగత్తుపునాది వేయబడకముందే అక్కడ పెట్టబడినది. మీరు ఏమైయున్నారో ఆయన ఎరిగియున్నాడు.

45 నేను సిద్ధాంతాన్ని కలగలుపు చేయడానికి కాదు గానీ, దానిని సరిచేయడానికే, దీనిని చెప్తున్నాను, తద్వారా మనము ఈ భయభీతుల నుండి తొలగిపోవుటకైయున్నది. మీరు ఎవరో మీకు తెలియదు. మీరు అవ్వబోతున్నారు కాదు గానీ, మీరు ఇప్పుడే దేవుని కుమారులు మరియు కుమార్తెలైయున్నారు. చూడండి, మీరు ఎల్లప్పుడూ దేవుని కుమారులైయున్నారు. చూశారా?

46 ఏలయనగా ఆదిలో దేవుడు ఆయనయొక్క తలంపులలో నిన్ను కలిగియున్నప్పుడు, నీవు ఉండవలసియున్నావు, నీలోని కొంత భాగము, ఇప్పుడు నీలో ఉన్న నీ జీవము, ముందుగానే అక్కడ దేవునితో ఉండవలసియున్నది. సరి, ఆయన, ఆయన ఇక్కడ భూమి మీద ఒక రూపముగా మారకముందే, దేవుడు తప్ప, అసలు ఏదియు లేకముందే, నీవు ఆయనయొక్క ఒక గుణలక్షణమైయున్నావు. నీ పేరు ఏమైయుంటుందో ఆయన ఎరిగియున్నాడు. నీవు ఏ రంగు తలవెంట్రుకలను కలిగియుంటావో ఆయన ఎరిగియున్నాడు. నీ గురించి సమస్తము ఆయన ఎరిగియున్నాడు. జరిగిన ఒకే ఒక్కటి ఏమిటంటే నీవు, ఒక పాపివైయుండగా---

47 ఈ తలంపు మీద మీలో అనేకులు నాతో ఏకీభవించగలరు. మీరు ఒక చిన్న పిల్లవాడిగానైనా, లేదా ఒక చిన్న అమ్మాయిగానైనా ఉన్నప్పుడు, మీరు అటు ఇటు వెళ్ళేవారు మరియు కొన్ని విషయాలు ఉండేవి, మరి అవి మిగతా పిల్లల్ని కలవరపరచకపోయినా, మీలోనైతే ఏదో కేక వేసినట్లుగా అనిపించేది. నీవు ఒక పాపియైయున్నప్పటికి, ఎక్కడో దేవుడు ఉన్నాడు అని అనిపించేది. మీకు అది గుర్తుందా? నిశ్చయంగా. ఇప్పుడు అది ఏమిటి? అది అప్పుడు మీలో ఉన్న ఆ చిన్న జీవముయొక్క రూపమైయున్నది.

48 మరియు పిదప కొంత కాలానికి, మీరు సువార్తను విన్నారు. బహుశా మీరు సంఘమునకు వెళ్ళియుండవచ్చును, మీరు *దీనిని* మరియు దానిని తీసుకొని, మరియు సంఘశాఖ నుండి సంఘశాఖకు వెళ్ళియుండవచ్చును. కానీ ఒక రోజు, మరి మీరు దేవునిలో భాగమైయుండగా, మీరు వాక్యములో భాగమైయుండవలసియున్నారు. మరియు మీరు వాక్యమును వినినప్పుడు,

మీరెక్కడనుండి వచ్చారో మీకు తెలిసినది, సత్యము ఏమిటో మీకు తెలిసినది. మీరు ఎల్లప్పుడూ ఉండియున్నారు, ఆ విత్తనము ఎల్లప్పుడూ మీలో ఉండియున్నది. వాక్యము, జగత్తుపునాది వేయబడకముందే మీలో ఉన్న వాక్యము, వాక్యమును చూసినది మరియు మీరు దానియొద్దకు వచ్చారు.

49 నా చిన్న పక్షిరాజు కథవలె ఉన్నది, అది ఆ చిన్న పక్షిరాజు ఏ విధంగా కోడి క్రింద పొదగబడి పిల్లయైనది అనేదాని గురించైయున్నది. మరియు ఆ చిన్నది కోడిపిల్లలతో కలిసి తిరుగుతున్నది, అది, అనగా ఆ కోడి కూత కూసింది, మరియు దాని కూత దీనికి అర్థం కాలేదు. మరియు——మరియు ఈ చిన్న కోడిపిల్లలు, ఆ కోళ్ళదొడ్డిలో అవి తింటున్న వాటి ఆహారము, అవి దానిని ఎలా తింటున్నాయో, దీనికి——దీనికి అర్థం కాలేదు. అయితే ఆ కోడి పిల్లకు భిన్నమైనదేదో, దానిలో ఉన్నట్లుగాయున్నది, ఎందుకంటే మొదటినుండే అది ఒక పక్షిరాజైయున్నది. అది నిజము. ఒక రోజు దాని తల్లి దానిని వెత్తుక్కుంటూ వచ్చినది, మరియు, ఆ పక్షిరాజుయొక్క కేకను అది వినినప్పుడు, అది ఆ కోడి కూతకు భిన్నంగా ఉన్నది.

50 మరియు తిరిగి-జన్మించిన ప్రతీ విశ్వాసి విషయములోను అది ఆ విధంగానే ఉన్నది. మీరు వినాలనుకున్న వేదపాండిత్యమంతటినీ, మరియు మానవ-కల్పితమైన భేదములన్నిటినీ మీరు వినవచ్చును; కానీ ఆ వాక్యము అక్కడ ప్రకాశించినప్పుడు, అప్పుడు ఏదో పట్టుకుంటుంది, మీరు దానిని గుర్తిస్తారు. “ఒకప్పుడు పాపములో (ఆ జీవితములో) చచ్చినవారైన మిమ్మల్ని ఆయన పురిగొల్పాడు.” పురిగొల్పడానికి, మొదటిగా అక్కడ ఒక జీవము ఉండవలసియున్నది. దేవుడు, ఆయనయొక్క ముందుజ్ఞానము ద్వారా, సమస్త విషయాలను ఎరిగియున్నాడు. మరియు మనము దేవుని కుమారులుగా మరియు కుమార్తెలుగా ఉండటానికి ముందుగా నిర్ణయించబడ్డాము. “పాపములోను అపరాధములలోను చచ్చినవారైన మిమ్మల్ని, మరి గడిచిన కాలమందు మనమందరము ఆ విధంగా ఉండియున్నాము, కానీ ఆయన మనల్ని పురిగొల్పినాడు.”

51 పౌలును చూడండి, పౌలు ఒక గొప్ప వేదపండితుడైయున్నాడు. కానీ అతడు ఆ వాక్యమైయున్న యేసుతో, ముఖాముఖి అయినప్పుడు, అది పురిగొల్పినది. వెంటనే అతడు జీవములోనికి వచ్చాడు, ఎందుకనగా ఆ విధంగా ఉండటానికి అతడు నియమించబడ్డాడు. ఆ-‐-అతడు వాక్యములో భాగమైయున్నాడు; మరియు వాక్యము వాక్యమును చూసినప్పుడు, అది అతని స్వభావమైయున్నది. ఆ సాంప్రదాయ సంఘములలోని, కోళ్ళయొక్క కూతలన్నీ, అతని మీద ఎటువంటి ప్రభావమును చూపించలేదు; అతడు వాక్యమును చూశాడు. అది అతనిలో భాగమైయున్నది. అతడు ఒక పక్షిరాజైయున్నాడు. అతడు ఒక కోడిపిల్ల కాదు; అతడు కేవలం వాటితో కోళ్ళదొడ్డిలో ఉన్నాడంతే. కానీ అసలు ప్రారంభమునుండే, అతడు ఒక పక్షిరాజైయున్నాడు.

52 అటువంటి ఒక చిన్న కథనే నేను విన్నాను, అది అవమానకరంగా ఉండదని నేను ఆశిస్తున్నాను, అది ఒక కోడి క్రింద పొదగబడిన ఒక చిన్న బాతు గురించైయున్నది. దానికి అర్థం కాలేదు. వింతగా-కనిపించే ఒక చిన్నది, వింత జీవియైయున్నది, ఆ దుమ్ము మరియు అదంతా దానికి అర్థం కాలేదు. అవి కోళ్ళదొడ్డిలో ఆడుకుంటున్నాయి. అయితే ఒక రోజు ఆ పెద్ద కోడిపెట్ట

ఆ కోడిపిల్లలను ఆ దొడ్డి వెనుక బయటకు తీసుకెళ్ళినది, మరియు దానికి నీటివాసన తగిలినది. ఇంకేంటి, అది వెళ్ళగలిగినంత వేగముగా అది ఆ నీటి వైపుకు పరుగెత్తినది. ఎందుకని? అది ముందెన్నడూ ఒక కొలనులో లేదు. అది ముందెన్నడూ నీటిలో లేదు. అయితే అది ప్రారంభమునుండే, ఒక బాతుయైయున్నది. అది చేయవలసిన ఒకే ఒక్కటి ఏమిటంటే దానినది గుర్తించుకోవడమే.

53 విశ్వాసి కూడా ఆ విధంగానే ఉన్నాడు. అతడు దేవుడిని ముఖాముఖిగా కలుసుకున్నప్పుడు, అతడు తననుతాను గుర్తించుకొనునట్టిది ఏదో, అతనిలో ఉన్నది. ఆ విత్తనము అతనిలో ఉన్నది, మరియు అది పురిగొల్పబడినది. మై, అది నిజము, మరియు అతడు లోకసంబంధమైన కార్యములనుండి దూరంగా వెళ్ళిపోతాడు. అవి అతనికి మృతమైపోతాయి. మై, నాకు జ్ఞాపకమున్నది, గతంలో, మనమందరం కూడా ఆ లోకసంబంధమైన విషయాలలోనే మన జీవితాన్ని గడిపాము. కానీ ఒక్కసారి మనం ఆ అసలైనదానిని, మనల్ని పురిగొల్పినదానిని పట్టుకున్నప్పుడు, ఒక చిన్న విత్తనము జీవములోనికి వచ్చినప్పుడు మాత్రం, అప్పుడు లోకపు సంగతులన్నీ సరిగ్గా అక్కడే కుళ్ళిపోయినవి. ఇకమీదట దాని కొరకు మనకు ఎటువంటి కోరిక లేదు.

54 "దేవుని మూలముగా పుట్టినవాడు, పాపము చేయడు. ఆరాధికుడు ఒక్కసారే కడుగబడిన తర్వాత అతని మనస్సాక్షికి పాపజ్ఞప్తి ఇకను ఉండదు, పాపము చేయాలనే కోరిక ఇకను ఉండదు." పాపపు ప్రశ్న ముగించబడినది. మీరు క్రీస్తునందు, దేవునిలో ఒక భాగమయ్యారు. మిమ్మల్ని విమోచించడానికి క్రీస్తు మరణించాడు.

55 ఇప్పుడు దేవుడు గనుక మనల్ని బాగుచేసియుండకపోతే మనము ఏమైపోయేవారమో ఆలోచించండి. కానీ దేవుడు, ఆయనయొక్క సంపన్నమైన కరుణతో, ఆయన మనల్ని ఈ రాత్రి ఎలా విమోచించాడు కదా! దేవునియొక్క సంపన్నమైన కరుణ మన మీద లేకపోతే ఈ రాత్రి మనము ఎక్కడ ఉండేవారము?

56 ఒక సమయంలో లోకము పాపముతో ఎంతగానో నిండియున్నది, మనిషి భూమి మీదికి అవినీతి రావడానికి కారకుడయ్యాడు ఎంతగా అంటే దేవుడు అసలు మనిషిని చేసినందుకు అది ఆయనకు సంతాపమును కలుగజేసింది. తల అంతయు, శరీరమంతయు కుళ్ళుపట్టిన పుండులా మారిపోయినది, మరియు చివరకు తాను నరుని చేసినందుకు దేవుడు సంతాపమునొందాడు. కాబట్టి ఆయన ఇట్లన్నాడు, "నేను సృష్టించిన నరుని నేను నాశనం చేస్తాను." అతడు కేవలం అవినీతిని తప్ప మరిదేనిని కలిగిలేడు గనుక ఆయన వారిని నాశనము చేస్తాడు.

57 మరియు ఆ సమయంలో మానవజాతి అంతయు తుడిచివేయబడియుండేది, కానీ దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, అమాయకులను దోషులతోపాటు నశించిపోనివ్వలేదు. మరియు ఆయన అలాగే వెళ్ళి లోపలికి రాగోరినవారి కొరకు, సరియైనదానిని చేయగోరినవారి కొరకు ఒక మార్గమును ఏర్పాటుచేశాడు. ఆయన, కనికరమును కోరుకున్నవారి కొరకు ఒక కనికరపు మార్గమును ఏర్పాటుచేశాడు, మరియు ఆయన ఒక ఓడను సిద్ధపరిచాడు. ఇంకో మాటలో చెప్పాలంటే, ఆయన తన పక్షిరాజుల మీద కొన్ని

రెక్కలను పెట్టాడు, తద్వారా వారు కోళ్ళతోపాటు మునిగిపోకుండా, తీర్పుకు పైగా ఎగరగలుగుటకైయున్నది. అయితే ఆయన—ఆయన నోవహు దినములలో, ఒక తప్పించుకొను మార్గమును ఏర్పాటుచేశాడు. ఆయన దానిని చేయడానికి, దానిని ఏర్పాటుచేయడానికి కారణము ఇదే, అదేమిటంటే ఆయన కరుణా సంపన్నుడైయున్నాడు.

58 అయితే ఆయన ప్రజల కొరకు ఒక మార్గమును ఏర్పాటుచేసిన తర్వాత మరియు పిదప వారు దానిని నిరాకరించినప్పుడు, ఇప్పుడు, వారు దానిని నిరాకరించడానికి కారణమేమిటంటే అసలు దానిని స్వీకరించడానికి వారి లోపల ఏమీ లేదు. దానిని స్వీకరించడానికి ఏమీ లేదు. మా అమ్మ ఈ విధంగా అంటూ ఉండేది, "ఆ టర్నిప్ దుంపలోనుండి ఏ రక్తము రాదు, ఎందుకంటే ఆ టర్నిప్ దుంపలో అసలు రక్తమే లేదు." కాబట్టి దానిని స్వీకరించడానికి ఆ లోపల ఎటువంటి జీవము లేనట్లైతే, అప్పుడది స్వీకరించబడజాలదు.

59 ఆ కారణముచేతనే ఆ పరిసయ్యులు నేరుగా యేసు ముఖము వైపు చూసి, మరియు ఆయనను, "బయెల్జెబూబు" అని పిలువగలిగారు, ఎందుకంటే ఆయనను స్వీకరించడానికి వారిలో ఏమీ లేదు. "అయితే తండ్రి నాకు అనుగ్రహించినవారందరూ," అని ఆయన చెప్పాడు, "నా యొద్దకు వచ్చెదరు." అది ఏదో ఒక విధంగా ప్రదర్శించబడుతుంది.

60 మీరు కొన్నిసార్లు వీధుల్లో ప్రజలతో మాట్లాడవచ్చును, వారితో ప్రభువు గురించి మాట్లాడవచ్చును, వారు నేరుగా మీ ముఖము ఎదుటనే నవ్వుతారు. సరే, ఎలాగైనా, మనం దానిని చేయవలసియున్నాము. అయితే వినండి, "మొదటిగా నా తండ్రి వానిని ఆకర్షించితేనే గాని ఎవడును నా యొద్దకు రాలేడు." ఆ ఆకర్షించడమనేది దేవుడే చేయవలసియున్నాడు. అక్కడ ఒక జీవము ఉండవలసియున్నది. "ఆయన నాకు అనుగ్రహించిన వారందరు, నా యొద్దకు వచ్చెదరు."

61 విమోచించబడాలని కోరుచున్న వారికొరకు ఆయన ఒక మార్గమును ఏర్పాటుచేశాడు. స్వస్థపరచబడాలని కోరుచున్న వారికొరకు ఆయన ఒక మార్గమును ఏర్పాటుచేశాడు. మరియు పిదప ఆయన దీనిని చేశాడు గనుక, ఆయన ఎల్లప్పుడూ కరుణా సంపన్నుడైయున్నలాగునే, అది ఆయనను కరుణా సంపన్నుడిగా చేసినది. అది తప్పకుండా ఆ విధంగా ఉండవలసియున్నది, మీరు దీనిని నిరాకరించినట్లైతే, ఇక తీర్పు తప్ప మరొకటి మిగిలిలేదు, ఎందుకంటే పాపమునకు తీర్పు తీర్చబడవలసియున్నది.

62 ఫరో, ఒక అనుకరణకర్తయైయుండి, మోషే వెళ్ళినట్లే అతడు కూడా వెళ్ళగలడని చూసి, అతడు సముద్రములోనికి వెళ్ళాడు. మోషే అతని సైన్యముతో, మరియు ఫరో అతని సైన్యముతో, ఇరువురు కూడా ఆ సముద్రములో నాశనమైపోవలసియున్నట్లు, అగుపించినది. కానీ, కరుణా సంపన్నుడైన దేవుడు, హెబ్రీ పిల్లల కొరకు ఒక తప్పించుకునే మార్గమును ఏర్పాటుచేశాడు, (ఎందుకని?) ఎందుకంటే వారు విధినిర్వహణలో ఉన్నారు, వారు వాక్యమును వెంబడిస్తున్నారు.

63 ఇప్పుడు కరుణను పొందుకోడానికి ఒకేఒక్క మార్గము అదేయైయున్నది,

వెంబడించమని దేవుడు మనకు ఇచ్చిన సూచనలను వెంబడించుట ద్వారానేయైయున్నది. ఆయన కరుణ చూపించగలుగుటకు ఏకైక మార్గము అది మాత్రమేయైయున్నది, అది ఆయన చేయమని చెప్పినదానిని మనము చేసినప్పుడేయైయున్నది.

64 కొద్దికాలం క్రితమే ఒక సేవకునితో జరిగిన ఒక చిన్న చర్చవలె ఉన్నది, నేను ఈనాడు ఒక అపొస్తలుల సిద్ధాంతమును బోధిస్తున్నానని అతడు అన్నాడు. నేను దాని గురించి ఒకటి లేదా రెండు రాత్రుల క్రితమో, లేదా ఏదో సమయములో మాట్లాడానని నేను నమ్ముతున్నాను, "నీవు ఈ కాలములో, ఒక అపొస్తలుల సిద్ధాంతాన్ని జొప్పించడానికి, ప్రయత్నిస్తున్నావు," అని అతడెలా అన్నాడు అనేదాని గురించి చెప్పాను. అతడు ఇట్లన్నాడు, "అపొస్తలుల కాలము, అపొస్తలులతోనే ముగిసిపోయినది."

మరియు నేను అతడిని ఇట్లడిగాను, "మంచిది, నీవు వాక్యమును నమ్ముతావా?"

అందుకతడు "అవును," అని చెప్పాడు.

65 నేను ఇట్లన్నాను, "ప్రకటన 22:18, ఇట్లు చెప్తున్నది, 'ఎవడైనను దానినుండి ఒక్క మాటను తీసివేసినా, లేదా దానికి ఒక్క మాటను కలిపినా,' రెండు మాటలను కాదు; ఒక్క మాట, ఒక్క మాటను తీసివేసినా."

అతడిట్లన్నాడు, "నేను దానిని నమ్ముతున్నాను."

66 నేను ఇట్లన్నాను, "అలాగైతే అపొస్తలుల కాలము ఎక్కడ ఇవ్వబడినదో, అపొస్తలుల ఆశీర్వాదములు సంఘమునకు ఎక్కడ ఇవ్వబడినవో నేను నీకు చెప్పగలను; ఇప్పుడు దేవుడు దానిని సంఘములో నుండి ఎక్కడ తీసివేశాడో, వాక్యము ద్వారా నీవు నాకు చెప్పు. నీవు దానిని చేయలేవు; అది అక్కడ లేదు." నేను ఇట్లు చెప్పాను, "ఇప్పుడు గుర్తుంచుకో, పేతురు, పెంతెకొస్తు దినమున, మరి అతడే అపొస్తలుల కాలమునకు పరిచయకర్తయైయున్నాడు. మరియు అతడు వారందరికీ ఇట్లు చెప్పాడు, 'పాపక్షమాపణ నిమిత్తము, పశ్చాత్తాపపడి మరియు యేసుక్రీస్తు నామములో బాప్తిస్మము పొందుడి, మరియు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందెదరు. ఏలయనగా ఈ వాగ్దానము మీకును, మరియు మీ పిల్లలకును, మరియు దూరస్థులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు పిలుచువారందరికిని చెందియున్నది.'"

67 ఇప్పుడు మీరు ఏదో ఒక సంఘశాఖ కోడియొక్క కూతను విని, మరియు బయట అక్కడ ఆ లోకపు సంగతులలో జీవించగోరుతున్నట్లైతే, అప్పుడు ఏదో తప్పున్నదని అది చూపిస్తుంది. ఎందుకంటే, అది వాక్యమైయున్నది. "ఇచ్ఛయించు ప్రతివానిని, రానిమ్ము." మరియు మీకు ఒక కోరిక ఉన్నట్లైతే, మీరు రావాలి. కానీ మీకు ఎటువంటి కోరిక లేకపోతే, అప్పుడు మీరు ఒక బాధాకరమైన స్థితిలో ఉన్నారు. కానీ రావడానికి మీకు ఒక కోరిక ఉన్నట్లైతే, వచ్చి దేవుని సూత్రమును వెంబడించండి!

68 మరియు ఆయన వాగ్దానము చేసినదానిని నెరవేర్చడంలో ఆయన ఎన్నడూ విఫలమవ్వడు. ఒకప్పుడు నేను యవ్వనస్థుడిగా ఉన్నాను, మరియు ఇప్పుడు నేను వృద్ధుడనైపోయాను, ఇంతవరకు ఆయన తన వాక్యములో విఫలమవ్వడాన్ని

నేను ఎన్నడూ చూడలేదు. ఎందుకంటే, ఆయన విఫలమవ్వడం తప్ప దేనినైనా చేయగలడు. ఆయన విఫలమవ్వలేడు. దేవుడు దానిని చేయలేడు. దేవుడు విఫలమైపోయి, దేవునిగా ఉండటమనేది అసాధ్యము. ఆయన అట్లుండుటకు, దానిని చేయవలసియున్నాడు.

69 ఇప్పుడు ఫరో సైన్యము అనుకరించడానికి ప్రయత్నించినది, ఎందుకంటే వారు పిలువబడలేదు మరియు వారు ఆ జీవమును కలిగిలేరు. దానిలోనికి... వాగ్దానము ఫరోకు ఇవ్వబడలేదు. ఒక వాగ్దాన దేశమును గూర్చిన వాగ్దానము అతనికి ఇవ్వబడలేదు.

70 మరియు అటువంటి దానికి పిలువబడిన ఒక నిజమైన విశ్వాసిని, ఒక అనుకరణకర్త వెంబడించడానికి ప్రయత్నించినప్పుడు, అతడు కేవలం దానికి ఎగతాళిని కలుగజేస్తాడు. ఈనాడు మన మతసంబంధమైన వ్యవస్థతో సమస్య అదే, అదేమిటంటే అనేకమంది ప్రజలు పరిశుద్ధాత్మను అనుకరించడానికి ప్రయత్నిస్తున్నారు, అనేకమంది ప్రజలు బాప్తిస్మమును అనుకరించడానికి ప్రయత్నిస్తున్నారు, అనేకమంది ప్రజలు అపొస్తలుల కాలమును అనుకరించడానికి ప్రయత్నిస్తున్నారు. అది విశ్వాసుల కొరకైయున్నది, మరియు వారి కొరకు మాత్రమేయైయున్నది. దేవుడు కరుణా సంపన్నుడైయుండి, తన పిల్లలు నశించిపోకూడదని, ఒక మార్గమును ఏర్పాటుచేశాడు. ఆయన వారి కొరకు ఒక మార్గమును ఏర్పాటుచేశాడు.

71 ఇప్పుడు, ఫరో ఇంకను వారి వెంటపడాలని ప్రయత్నిస్తూ, మోషేని మరియు అతని గుంపుని రక్షించిన అదే నీటిలో అతడు మునిగిపోయాడు. ఇప్పుడు, మోషే మునిగిపోలేదు, ఎందుకంటే ఆయనయొక్క ఏర్పాటుచేయబడిన మార్గమును వెంబడిస్తున్నవారికి, దేవుడు కరుణా సంపన్నుడైయున్నాడు. ఆమేన్.

72 నా భావమేమిటో మీరు చూడగలుగుతున్నారా? అదేమిటంటే, ఈ రాత్రి, దైవిక స్వస్థతను నమ్మని ప్రజలు, పరిశుద్ధాత్మ బాప్తిస్మమును నమ్మని ప్రజలు, వారు అసలు దేనినైనా ఎలా పొందుకోగలరు? దేవుడు ఆయనను వెంబడించేవారికి కరుణా సంపన్నుడైయున్నాడు; దేవుడిని వెంబడించువారికే గానీ, ఒక మతసిద్ధాంతమును వెంబడించేవారికి కాదు.

73 దేవుడు వాక్యమైయున్నాడు, మరియు అది శరీరధారియై మన మధ్య నివసించినది, ఇప్పుడు, తద్వారా ఆయన దేవునియొక్క ఇతర గుణలక్షణములను బయటకు తేగలుగుటకైయున్నది. ఆ శరీరము, యేసు, దేవుని శరీరమైయున్నాడు, ఒక గుణలక్షణమైయున్నాడు. ఆయన ప్రక్కనుండి వెళ్ళడాన్ని మోషే చూశాడు, ఆయనయొక్క వీపు భాగమును చూశాడు; ఏ మనుష్యుడును ఆయన ముఖమును చూడలేదు. అయితే ఇప్పుడు మనము ఆయనను చూశాము, మనము ఆయనను చూశాము, ఆయనను బల్యర్పణగా చూశాము. ఇప్పుడు, చూడండి, వాక్యమును ప్రదర్శిస్తూ, ఆయన దేవునియొక్క ఒక గుణలక్షణమైయున్నాడు. ఆయన అదేయైయున్నాడు.

74 మరియు ఏ విశ్వాసియైనా దేవుని యొద్దకు వచ్చినప్పుడు, అతడు దేవుని వాక్యముయొక్క గుణలక్షణముగా మారతాడు, ఆ దినము కొరకు వాగ్దానము చేయబడిన వాక్యమును ప్రత్యక్షపరచడానికి అతడు ఉపయోగించబడతాడు.

చూశారా? అది నిజము. కరుణా సంపన్నుడైన, దేవుడు, ఒక సాక్ష్యం లేకుండా మనల్ని ఎన్నడూ విడిచిపెట్టలేదు. ఆయన కరుణా సంపన్నుడైయున్నాడు.

75 అక్కడ మృత సముద్రము నొద్ద, లేదా ఎర్ర సముద్రము నొద్ద, మోషే పట్ల దేవుడెంతగానో కరుణా సంపన్నుడైయున్నాడని మనము ఇప్పుడు కనుగొంటాము. పిదప ఆయన ఇక్కడ ఇట్లు చెప్పాడు, నిర్గమకాండము 19:4 లో, ఆయన ఇట్లు చెప్పాడు, "నేను మిమ్మల్ని పక్షిరాజు రెక్కల మీద మోసుకొని, మిమ్మల్ని నా యొద్దకు చేర్చుకున్నాను. పక్షిరాజు రెక్కల మీద వారిని మోసుకొని, మరియు మిమ్మల్ని నా యొద్దకు చేర్చుకున్నాను!" అప్పుడు బయట అక్కడ, ఆ సముద్రం మధ్యన ఇతరులు కూడా ఉన్నారు, అనుకరించడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ ఏమిటి? "ఆయన వారినైతే పక్షిరాజు రెక్కల మీద మోసుకొనిపోయాడు."

76 ఇప్పుడు దేవుడు ఎల్లప్పుడూ తన ప్రవక్తలను పక్షిరాజులతో పోల్చుతాడు. మరియు అది ఏమిటి? మోషే ఆయనయొక్క వర్తమానికుడైయున్నాడు. మరియు వారు మోషేను వెంబడిస్తున్నారు, మరియు వారు మోసుకొనిపోబడిన పక్షిరాజు రెక్కలు అదేయైయున్నది, ఎందుకంటే అతడు దేవుని వర్తమానమును మోసుకెళ్తున్నాడు. మరియు ఆ ప్రజలు దానిని వెంబడించారు. అతనియొక్క విడుదల వర్తమానముతో వారు మోషేను వెంబడిస్తుండగా వారు దేవుడిని వెంబడించారు. మరియు "అతడు, వారు, నమ్మనివారితో కూడా నశించిపోలేదు," అని బైబిలు గ్రంథము చెప్పినది. ఎందుకంటే, వారు ఆయన ఆజ్ఞలను వెంబడిస్తున్నారు గనుక, దేవుడు వారిపట్ల కరుణా సంపన్నుడైయున్నాడు. మనం ఆయన ఆజ్ఞలను వెంబడించాలని దేవుడు కోరుతున్నాడు.

77 కోరహు మరియు దాతాను మరియు వారియొక్క అవిశ్వాస గుంపు గురించి కూడా మనము అదే విషయాన్ని చెప్పవచ్చును, వారు అనుకరించడానికి ప్రయత్నించారు. దేవుని ప్రణాళికలో దేనినో జొప్పించడానికి వారు ప్రయత్నించారు. ఒక్క-వ్యక్తి నాయకత్వం వారికి నచ్చలేదు. వారికి అది నచ్చలేదు. వారు కూడా ఏదో ఒకటి చేయాల్సిందే అన్నట్లు వారు ప్రవర్తించారు. కోరహు ఇట్లన్నాడు, "ఏంటి, మోషే, నీకంటే పరిశుద్ధులు చాలామంది ఉన్నారు. నీవు ఒక్కడివే సముద్రము అన్నట్లు...లేదా, సముద్రపు ఒడ్డున నునుపైన రాయివి నీవొక్కడివే అన్నట్లు నీవు ప్రవర్తిస్తున్నావు." మరియు ఇంకా ఇట్లన్నాడు, "నేను—నేను...నీవు అలా చేయకూడదు. మరియు ఇక్కడ చాలామంది ఉన్నారు."

78 మరియు మోషే తాను ఆ పిల్లలను వాగ్దాన దేశములోనికి తీసుకెళ్ళవలసియున్నాడని ఎరిగియున్నాడు, ఎందుకంటే వాగ్దానము అతనికి ఇవ్వబడినది. మరియు అతడే వారిని వాగ్దాన దేశమునకు తీసుకెళ్ళవలసియున్నాడు.

79 మరియు, ఈనాడు, దేవునియొక్క వాక్యమును నిర్ధారించడానికి పరిశుద్ధాత్మ ఇక్కడున్నాడు, మరియు మనము స్వారీ చేయాల్సిన పక్షిరాజు రెక్క అదేయైయున్నది; ఏదో ఒక మానవ-కల్పితమైన వేదపాండిత్యము మీద కాదు. అయితే మనము వాగ్దాన దేశమునకు, పక్షిరాజు రెక్కల మీద స్వారీ చేయవలసియున్నాము.

80 మరియు ఇక్కడ, కోరహు ఇట్లనుకున్నాడు, మీకు తెలుసా, అక్కడికి వచ్చి, ఈ పక్షిరాజును, అనుకరించడానికి, బయట అక్కడ వారు ఒక కోళ్ళ గుంపును తెచ్చుకోబోతున్నారు. మరియు వారు అట్లు చేసినప్పుడు, "వారినుండి నిన్ను నీవు వేరుచేసుకో," అని దేవుడు చెప్పాడు, మరియు ఆయన లోకమును మ్రింగివేశాడు. ఆయన ఆ పూర్తి విషయాన్ని, సృష్టియంతటిని మ్రింగివేసియుండేవాడే, కానీ దేవుడు తన వాక్యాన్ని వెంబడించడానికి ప్రయత్నిస్తున్న వారిపట్ల కరుణా సంపన్నుడైయున్నాడు. ఎల్లప్పుడూ, దేవుడు కరుణా సంపన్నుడైయున్నాడు. వారిలో అనేకులు మోషే పక్షమున చేరారు, మరియు దేవుడు భూమిని తెరచి అవిశ్వాసిని మ్రింగివేశాడు. అతడు, అనగా ఆ——ఆ అవిశ్వాసి, ఎల్లప్పుడూ నశించిపోతాడు.

81 ఎవరైతే నమ్మలేదో, వారు బయటకు వచ్చి మరియు కొంతకాలం నడిచినప్పటికినీ, మరైనను, వారు, యేసు ఇట్లన్నాడు, "వారిలో, ప్రతియొక్కరు, మరణించారు." *మరణించడం* అంటే "నిర్మూలమైపోవడం." వారు మరణించారు. కేవలం వారి గురించి ఆలోచించండి. వారు బయటకు వచ్చారు, దేవుని అద్భుతములను చూశారు, దేవునియొక్క గొప్ప హస్తమును చూశారు, మన్నాను అనుభవించి ఆనందించారు; మరియు వారు బయట అక్కడికి వెళ్ళి "మనమందరము సహోదరులము, కాబట్టి మనమందరం ఏకమవుదాము," అంటూ వాక్యమునకు విరుద్ధమైన తన బోధచేత, దేవుని మార్గమును వంకర చేసినట్టి, బిలాము అను పేరుగల ఒక మనుష్యుని మాటను విన్నారు.

82 అది ఈనాడు, పైకి లేస్తున్న మరొక బిలాము సిద్ధాంతమైయున్నది, "మనమంతా ఒక్కటౌదాము." అది పని చేయదు. మనము పక్షిరాజుతో, యెహోవా పక్షిరాజుతో కలిసి నడుద్దాం. మీరు పక్షిరాజు పిల్లలైయున్నారు.

83 ఆ గుంపంతటిలో ముగ్గురు మాత్రమే రక్షించబడ్డారు; మోషే, కాలేబు, మరియు యెహోషువ. ఆ మిగతావారు అరణ్యములోనే నశించిపోయారు; పరిశుద్ధ యోహాను 6వ అధ్యాయంలో, యేసు దానిని చెప్పాడు. దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, ఆ మిగతా అవిశ్వాసులతో కలిసి, వారిని నశించిపోనివ్వలేదు. వారందరూ సరిగ్గా అక్కడే అరణ్యములో మరణించారు, మరియు వారు మృతులైయున్నారు. దేవుడు మోషేను మరియు పక్షిరాజు విశ్వాసులను రక్షించాడు, ఎందుకంటే వారు ఆయనయొక్క వాక్యమును గౌరవించారు.

84 మరియు స్నేహితుడా, ఈనాడు, మనం దేవుని దయను పొందగల ఒకే ఒక్క మార్గమేమిటంటే; ఈనాడు, దేవుడు కరుణా సంపన్నుడైయున్నాడు, కానీ దాని గురించి ఆయన ఏమి చెప్పాడో దానిని మనం గౌరవించవలసియున్నాము. కేవలం ఎవరో చెప్పినదానిని మీరు తీసుకోలేరు. దేవుడు చెప్పినదానినే మీరు తీసుకోవలసియున్నారు. ఆయన ఇట్లు చెప్పాడు, "ప్రతీ మనుష్యుని మాట అబద్ధమే గాని, నా మాట సత్యము."

85 ఈనాడు మనకు ఇట్లు చెప్పబడుతున్నది, "మీరు చేయాల్సిందంతా," అనేక చోట్లలో ఇట్లు చెప్పబడుతున్నది, "సంఘములో చేరడమే, ఒక మతసిద్ధాంతమును, లేదా అటువంటి దేనినో కలిగియుండటమే; లేదా ఒక ప్రార్థనను వల్లించడమే, లేదా మీ పేరును గ్రంథములో వ్రాయించుకోడమే, లేదా

చిలకరించబడటమే లేదా ఏదో ఒక విధానములో బాప్తిస్మము పొందడమే, లేదా అటువంటిదేదో చేయడమే. మీరు చేయవలసినదంతా అదేనని అంటారు.” కానీ అది తప్పైయున్నది.

86 దేవునియొక్క పక్షిరాజుగా ఉండటానికి, మీరు దినదినము, వాక్యమును వెంబడించవలసియున్నారు. మీరు స్థిరముగా, వాక్యమును భుజించవలసియున్నారు.

87 ఇప్పుడు ఈ సమయము తర్వాత, దేవుడు వారికి కరుణ చూపించిన తర్వాత, విశ్వాసములో సన్నగిల్లి, వారు మరలా గొణగడాన్ని మనము కనుగొంటాము. మరియు వారు దేవుని పట్ల సణగడాన్ని మనము కనుగొంటాము, మరియు, వారు అలా చేసినప్పుడు, వారు సర్పపు కాటుచేత చనిపోతూ ఉన్నారు. సరి, వారు దానికి తగినవారే. వారు నిశ్చయంగా దానికి పాత్రులైయున్నారు. ఎవరైనాగాని దేవుని వాక్యమును తప్పుగా తీసుకొని మరియు వారు చేసిన ఈ కార్యాలను చేసినట్లైతే, వారు మరణానికి పాత్రులే. వారిలో ప్రతియొక్కరూ, అరణ్యములో చనిపోడానికి పాత్రులైయున్నారు.

88 అయితే డాక్టర్ మోషేయైనా మరియు వారిలో ఎవరైనా వారి కొరకు ఏమియు చేయలేనంతగా వారు వ్యాధిగ్రస్థులైనప్పుడు, మరి వారు వేలకు వేలమంది చనిపోతూ ఉన్నారు; కానీ దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, ఆయనయందు విశ్వాసముంచే వారికొరకు ఆయన ఒక మార్గమును ఏర్పాటుచేశాడు. ఒక ఇత్తడి సర్పమును పైకెత్తడం ద్వారా, ఆయన దానికి ఒక విరుగుడును ఏర్పాటుచేశాడు. దేవుడు సంపన్నుడైయుండి-‐-దేవుడు ఆయనయొక్క విశ్వసించే పిల్లలు స్వస్థపరచబడగలుగుటకు ఒక తప్పించుకునే మార్గమును ఏర్పాటుచేశాడు.

89 తప్పైయున్న ప్రతిదానిలో, నీవు ఆసక్తి చూపే ప్రతిదానిలో దేవుడు ఆసక్తి కలిగియున్నాడు. నీ జీవితములోని ప్రతి నడకలో, నీలో దేవుడు ఆసక్తి కలిగియున్నాడు. నీవు ఆయనయొక్క బిడ్డవైయున్నావు, మరియు ఆయన కరుణాసంపన్నుడైయున్నాడు. ఆయన నీ కొరకు చేయగోరుతున్నాడు.

90 ఆ తర్వాత, దేవుడు వారి కొరకు ప్రాయశ్చిత్తముగా చేసినట్టి దీని ద్వారానే, ఈ ఇత్తడి సర్పము ద్వారానే ఆ ప్రజలు పాపము చేశారు, మరి అది ఇదివరకే తీర్పు తీర్చబడిన పాపమునకు ప్రాతినిధ్యం వహించినది, మరియు వారు ఆ వరమును విగ్రహముగా చేసుకున్నారు. మరియు అది మరలా పాపమైనది. “దేవుడు తన మహిమను ఎవరితోనూ పంచుకోడు.” కాబట్టి, మనము ఇద్దరు, ముగ్గురు, నలుగురు దేవుళ్ళను కలిగియుండలేము. ఒకే ఒక్క దేవుడు ఉన్నాడు. ఆయన మరిదేనితోనూ ఆయనయొక్క మహిమను పంచుకోడు. ఆయన మాత్రమే దేవుడైయున్నాడు, చూడండి; అన్యులు అనేక దేవుళ్ళను కలిగియున్నారు. మనకు ఒకే ఒక్క దేవుడున్నాడు, మరియు ఆయన తన మహిమను మరొకరితో పంచుకోడు, అలాగే ఆయన దేనిని కూడా ఆయన ఎదుట విగ్రహముగా ఉండనివ్వడు. ప్రజల కొరకు ఆయన ఒక ప్రాయశ్చిత్తమును కలుగజేసినప్పటికీ, మరి అది దేవుని వాక్యమైయున్నది, అది సరియైయున్నది; కానీ వారు దానిని విగ్రహముగా చేసుకోవడం మొదలుపెట్టినప్పుడు, అప్పుడు వారు సమస్యలో పడ్డారు.

91 ఇప్పుడు మన సంఘకాలములకు జరిగినది కూడా, సరిగ్గా అదేనని, నేను అనుకుంటున్నాను. దేవుడు మార్టిన్ లూథర్ యొక్క వర్తమానముతో అతని వర్తమానమును పంపించాడు, జాన్ వెస్లీని, పెంతెకొస్తు వర్తమానమును పంపించాడు, అయితే మనము దానితో ఏమి చేశాము? ఆ ఇత్తడి సర్పముతో వారేమి చేశారో సరిగ్గా దానినే మనము చేశాము, మనము దానిని విగ్రహము లాగా చేశాము, "నేను దీనికి చెందియున్నాను, మరియు నేను దానికి చెందియున్నాను." మీరు గమనిస్తున్నారా, వాక్యముయొక్క నిజమైన దైవిక ఆరాధనతో ముడిపడి యుండవలసిన యధార్థత లేకుండా మీరు ఏదో ఒకదానికి చెందియుంటున్నారు.

92 ఏమి జరిగినది? బైబిలు గ్రంథము, బైబిలు గ్రంథములో మనకు ఇట్లు చెప్పబడినది, అదేమిటంటే, "ఆ ప్రవక్త ఆ విగ్రహాన్ని తీసుకొని మరియు దానిని నాశనము చేశాడు." హల్లెలూయా!

93 ఈనాడు రంగం మీద మనకు అవసరమైయున్నది ఏమిటంటే ఆ సంఘశాఖా విగ్రహాలను నాశనము చేసే ఒక ప్రవక్తయైయున్నాడు, ఏదో ఒక మత సిద్ధాంతమునకు లేదా ఒక సంఘశాఖకు చెందియుండటం ద్వారా వారు పరలోకానికి వెళ్తున్నారని వారు అనుకుంటున్నారు; అవి నాశనము చేయబడి దహించబడవలసియున్నవి, దూరముగా పారవేయబడవలసియున్నవి. దేవుడు కరుణతో నిండియున్నాడు. ఆయన కరుణా సంపన్నుడైయున్నాడు. ఈ దినమున మనమందరము బయట అక్కడ ఆ అంధకార గందరగోళములో ఉండవలసియుండగా, మరైనను దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, దానికి ఆయనయొక్క స్వంత అనువాదముతో, అసలైన నిజమైన పరిశుద్ధాత్మను, ప్రతీ రాత్రి సరిగ్గా ఇక్కడ ఈ భవనంలోనే మనకు పంపించాడు. దేవుడు, ఆయనయొక్క కరుణయందు సంపన్నుడైయున్నాడు, మనం ఆయనను ఎంత అద్భుతమైనవాడిగా కనుగొంటున్నాము కదా! అవును, అయ్యా.

94 ఇప్పుడు వారు చేయవలసినదంతా కేవలం ఈ సర్పము దగ్గరకు, లేదా బయట అక్కడ దేవుడు, మోషేచేత తయారు చేపించి మరియు ఒక స్తంభము మీద వ్రేలాడదీయించిన ఆ చిన్న వస్తువు దగ్గరకు వెళ్ళడమేనని, మరియు ఎలాంటి యధార్థత లేకుండానే వారు స్వస్థత పొందగలరని వారు అనుకున్నారు. వారు ఊరకే నిలబడి దానిని చూశారు. మరియు వారు దానిని విగ్రహములాగా చేసుకోవడం మొదలుపెట్టారు, మరియు దేవుడు ఒక ప్రవక్తను పంపించి దానిని నాశనము చేశాడు.

95 ఇప్పుడు, అరణ్యములో ఆ సర్పము వైపు చూడటానికి నిరాకరించిన వారందరూ, వారు నశించిపోయారు. ఇప్పుడు దేవుడు ఒక మార్గమును ఏర్పాటుచేస్తాడు, కానీ మీరు దానిని చూడటానికి నిరాకరిస్తే, మీరు వీధికి అవతలే కూర్చొని మీరు ఏదో మతసిద్ధాంతానికి వ్రేలాడియుండి మరియు అది సత్యమా కాదా అని తెలుసుకోడానికి నేరుగా వాక్యములోనికి చూడటానికి నిరాకరిస్తే; మరి చూడటానికి నిరాకరించిన వారందరు, వారు నశించిపోయారు. మరియు దేవుడు ఎన్నడూ-మారని దేవుడైయున్నాడు. మరియు చూడటానికి నిరాకరించిన వారందరు, నశించిపోయారు. ఈనాడు కూడా అది అట్లే ఉన్నది, అదే కార్యమైయున్నది.

96 పిదప వారెలప్పుడు చేసినట్లే, ఆ తర్వాత కూడా ఆ ప్రజలు పాపము చేశారు, మరియు దానినుండి——దానినుండి ఒక విగ్రహమును తయారు చేసుకున్నారు, దానిని ఒక——ఒక——ఒక...పొందుకోడానికి, యథార్థత లేకుండానే స్వస్థత పొందుకోడానికి ప్రయత్నించారు, మరియు ఈనాడు మనం చేస్తున్నట్లే, వారు "ఏదో ఒకదానికి చెందియున్నారు." మరియు ఇప్పుడు మనమిట్లు చూస్తాము, అప్పుడు దానిలోని తేడా, ఏమిటంటే, దేవుడు...

97 ఆ సమయమునకు అది ఒక మంచి ప్రాయశ్చిత్తమేయై యున్నది మరియు ఒక మంచి సూచనయేయై యున్నది. ఆ సమయమునకు, అది బాగానే ఉన్నది. కానీ అది ఆ సమయానికి, ఆ ప్రయాణముకు కొరకు మాత్రమే ఉండవలసియున్నది. అది దాని కొరకు మాత్రమే, ఆ ప్రయాణం కొరకు మాత్రమే పనిచేస్తుంది.

98 మరియు నీతికరణ గురించి, మార్టిన్ లూథర్ తెచ్చిన వర్తమానము, లూథర్ కాలమునకు బాగానే ఉన్నది. అది అంతవరకు మాత్రమే కొనసాగినది.

99 వెస్లీ కాలములో శుద్ధీకరణ బాగానే ఉన్నది. అది అంతవరకు మాత్రమే కొనసాగినది.

100 పిదప మనం పెంతెకొస్తు కాలములోనికి వచ్చాము. మరియు వరముల పునరుద్ధరణ చాలా చక్కని సంగతైయున్నది, ఆ కాలములో అది బాగానే ఉన్నది, కానీ ఇప్పుడు మనము దానిని దాటి వెళ్తున్నాము. ఒక ప్రపంచమనేది ఎంత నిశ్చయంగా ఉన్నదో, అంతే నిశ్చయంగా మనము దానిని దాటియున్నాము. మనం ఈ సంగతిని దాటవలసియున్నాము, ఎందుకంటే ముందు వారేమి చేశారో అదే కార్యమును మనము దానితో చేశాము, దానిని ఒక విగ్రహముగా చేశాము. "నేను దానియొక్క *ఈ* క్రమమునకు చెందినవాడను, నేను దానియొక్క ఆ క్రమమునకు చెందినవాడను."

101 దేవుడు ఎవరో ఒకరిని పంపి ఆ విషయాన్ని బ్రద్దలు కొట్టి మరియు దానిని ముక్కలు ముక్కలుగా చేస్తాడు, మరియు ఆయనయొక్క వాక్యమును, ఆయనయొక్క సంపూర్ణ వాక్యమును నిర్ధారిస్తాడు. గమనించండి. దేవునికి స్తుతి కలుగునుగాక! ఇప్పుడు అది సత్యమని మనము చూస్తున్నాము. కరుణా సంపన్నుడైన, దేవుడు!

102 పిదప ఆ ప్రవక్త దీనిని నాశనము చేసినప్పుడు, అది స్వస్థతకు గానీ, ప్రాయశ్చిత్తమునకు గానీ ఏ గురుతు లేకుండా వారిని విడిచిపెట్టింది, ఎందుకంటే వారి విగ్రహం నాశనం చేయబడినది. అయితే, కరుణా సంపన్నుడైన దేవుడు, వారికి మరొకటి తయారుచేశాడు. మరియు ఆయన, ఏమి చేశాడు? ఆయన ఆలయము వద్ద కోనేరులోని నీటిని కదిలించాడు, మరియు అనేకులు వచ్చి, ఈ నీటిలోకి అడుగుపెట్టడం ద్వారా, స్వస్థత పొందుకున్నారు. అదే కోనేటి దగ్గరకు యేసు వచ్చాడు, మరియు ఆ నీరు కదిలించబడటం కొరకు వేచిచూస్తూ, అనేక సంవత్సరాలుగా అక్కడ పడియున్న ఒక వ్యక్తిని చూశాడు. చూడండి, కరుణా సంపన్నుడైన దేవుడు! వారు ఆ విషయాన్ని విగ్రహంగా చేసుకున్నప్పటికీ, ప్రవక్త దానిని ముక్కలుగా చేయాల్సివచ్చినప్పటికీ, దేవుడు వారికి మరొక మార్గాన్ని కలుగజేశాడు, ఎందుకంటే ఆయన కరుణా సంపన్నుడైయున్నాడు. వారు స్వస్థత

పొందాలని ఆయన కోరుకున్నాడు, మరియు వారి స్వస్థత కొరకు ఒక మార్గాన్ని కలుగజేశాడు.

103 ఇక, అది అలా కొనసాగింది, లోకము అన్నివేళలా, ఇంకా ఇంకా పాపపూరితమవుతూ వచ్చింది. మరియు చివరికి లోకం పాపముతో ఎంతగా నిండిపోయిందంటే దేవుడు దానిని నాశనం చేసియుండేవాడే, ఆయన మలాకీ 4లో ఇట్లు చెప్పాడు, "నేను వచ్చి భూమిని శపించకుండునట్లు." ఆయన దానిని చేసియుండేవాడే; అది ఆయనకు అంత కష్టమేమీ కాదు.

104 అయితే పిదప, దేవుడు కరుణా సంపన్నుడైయుండి, ఆయన రక్షకుడైన, యేసుక్రీస్తును పంపించాడు. ఆయన యేసుక్రీస్తును రక్షకునిగాను స్వస్థపరచువానిగాను ఉండుటకు పంపించాడు. ఏలయనగా ఆయన ఇట్లు చెప్పాడు, "అరణ్యములో మోషే ఇత్తడి సర్పమును పైకెత్తినట్లు, ఆ ప్రకారమే మనుష్యకుమారుడు పైకెత్తబడవలెను," అదే ఉద్దేశ్యము కొరకైయున్నది. ఆయన, ఆ ప్రాయశ్చిత్తము, మనము దాని మీద మాత్రమే హక్కును కలిగియున్నాము, ఆ ప్రాయశ్చిత్తము తప్ప మరిదేని మీద కాదు. యేసు తన రక్తముచేత కొన్నదానిమీదనే, మనము హక్కులను కలిగియున్నాము. మరియు బైబిలు ఇట్లు చెప్పినది, "మన అతిక్రమక్రియలనుబట్టి ఆయన గాయపరచబడెను, మన దోషములనుబట్టి ఆయన నలుగగొట్టబడెను, మన సమాధానార్థమైన శిక్ష ఆయన మీద పడెను; ఆయన పొందిన దెబ్బలచేత మనము స్వస్థత పొందియున్నాము." దానిమీదనే మనము హక్కు పొందగలము, ఎందుకంటే మనకొరకు ఏర్పాటుచేయబడి, మనము దానికొరకు నిలబడేటటువంటిది, ఆ ప్రాయశ్చిత్తము మనకు దానిని సంపాదించినది. కరుణా సంపన్నుడైన, దేవుడు!

105 ఇది ఒక నిత్యమైన ప్రాయశ్చిత్తముగా ఉండవలసియున్నది, ఎందుకంటే స్వయంగా ఆయనే వచ్చాడు. ఒక—ఒక—ఒక నిత్యమైన ప్రాయశ్చిత్తమును చేయడానికి, దేవుడే స్వయంగా, పాప శరీరాకారములో వచ్చాడు; మరియు శరీరములో శ్రమను అనుభవించి, ప్రాయశ్చిత్తమును చేశాడు; మరియు ఆ ప్రాయశ్చిత్తమును నిర్ధారించడానికి, పరిశుద్ధాత్మ రూపములో తిరిగివచ్చాడు. మరి ఆ ఇత్తడి సర్పముగానీ, నీరు కదిలించబడే ఆ కోనేరుగానీ దానిని చేయలేకపోయాయి, అయితే అవన్నీ ఆ పరిపూర్ణమైన ప్రాయశ్చిత్తమువైపే చూపించాయి. కరుణా సంపన్నుడైన, దేవుడు, దీనిని చేశాడు.

106 ఇప్పుడు, ఈనాడు, ఇది మనం జీవిస్తున్న దినమైయుండగా, మనము ఈ సంఘకాలములగుండా వచ్చాము మరియు దానికి భిన్నమైన వివరణలతో దానినుండి దూరము చేశాము. మన దినములో ఉన్న వేదపండితులు ఎప్పుడో దాని వరుసను కోల్పోయారు. వారు దానంతటినీ మరొక విధంగా, మరొక దినమునకు, మరొక కాలమునకు అన్నట్లుగా, మరియు అది వెనుక, ఎంతో కాలం క్రితపుది అన్నట్లుగా, వివరించారు. మరియు దైవిక స్వస్థత కూడా దాదాపు అంతరించిపోయినట్లే అయినది, దానిని నమ్మేవారిని కనుగొనడం కష్టంగానే ఉంది. వారు దానిని ఎగతాళి చేశారు. దాదాపు ఎంతలేదన్నా ఇరవై సంవత్సరాల క్రితం నుండి కూడా వారు దానిని ఎగతాళి చేస్తూనే ఉన్నారు. పెంతెకొస్తువారు కూడా దాదాపుగా దాని నుండి దూరమైపోయారు. వారు ఆరంభదినాలలో దానితో ప్రారంభించినప్పటికీ, తర్వాత దానినుండి తొలగిపోయారు.

107 వారు ఏ విధంగా చేశారో చూడండి. ఇప్పుడు వారు సంఘశాఖలో మునిగిపోయారు, ప్రతియొక్కరు తమకొరకు తాము ఒక మతసిద్ధాంతమును, మరియు మొదలగువాటిని తయారు చేసుకోడానికి పరుగులు తీస్తున్నారు. వెలుగు లోపలికి వచ్చియుండగా, వెలుగును స్వీకరించడానికి బదులు; వారు సంస్థాగతమైపోయి తమకొరకు తాము మతాచారములను తయారుచేసుకున్నారు, ప్రతి యొక్కరు వచ్చి, తమకొరకు తాము ఒక సిద్ధాంతాన్ని తయారుచేసుకొని మరియు ఆ సిద్ధాంతములోనే స్థిరపడుతున్నారు. మరియు పిదప వారు దానిలోనిది ఎంతగా తీసివేశారంటే పరిశుద్ధాత్మ సంఘములోనికి రాలేకయున్నాడు. ఒక ఇత్తడి సర్పము వలె వారు కేవలం మరొక విగ్రహమయ్యారు, అది ఒక——ఒక విగ్రహారాధనగా మారినది. ప్రతియొక్కడు, "నేను దీనికి చెందియున్నాను, మరియు నేను దానికి చెందియున్నాను" అని చెప్పాడు. అది విగ్రహారాధనైయున్నది. అంత్యకాలములో, మనము ఎటువంటి ఒక గందరగోళంలో ఉన్నాము కదా.

108 కానీ దేవుడు, ఆయనయొక్క కరుణలో సంపన్నుడైయుండి, పరిశుద్ధాత్మను తిరిగి మన మీదకు పంపాడు, మరియు ఆయన చేస్తానని వాగ్దానము చేసినట్లే ఈ రాత్రి తన వాక్యమును ఋజువుచేస్తున్నాడు. దేవుడు ఈ కార్యములను చేస్తానని వాగ్దానము చేశాడు. ఆయన ఏమి చేశాడో చూడండి!

109 ఆయన ఏమి చేశాడో చూడండి, ప్రతీ కాలములో ఒక నిర్దిష్టమైన కార్యము జరుగుతుందని ఆయన ఎలా వాగ్దానము చేశాడో మనమిప్పుడు ఎలా చూడగలుగుతున్నాము కదా. మరియు అది, ఆయన ఎలా చేస్తానని చెప్పాడో సరిగ్గా అట్లే జరగడాన్ని మనము కనుగొంటాము, ఎందుకంటే ఆయన తనయొక్క కరుణలో సంపన్నుడైయుండి, ఆయన వాగ్దానము చేసిన ప్రతీ వాక్యమును నెరవేర్చడానికి ఎల్లప్పుడూ కరుణను కలిగియున్నాడు. ఆయన దానిని చేయవలసియున్నాడు, మరియు దేవుడిగా ఉండుటకు, ఎల్లప్పుడూ చేయవలసియున్నాడు. ఆయన ఎల్లప్పుడూ దీనిని చేస్తాడు, ఆయనయొక్క వాక్యము ఎల్లప్పుడూ దాని కాలములో నెరవేరుతుంది. భూమిలో ఆయన నాటిన ఆయనయొక్క విత్తనం. ఆయన ఏమి చేశాడు? ఆయన దానిని ఇక్కడ వాక్యములో ఉంచాడు, మరియు అది ఒక విత్తనమైయున్నది. మరియు ఆ కాలము వచ్చిన ప్రతీసారి, ఆ విత్తనము పరిపక్వము చెందుతుంది, మరియు పిదప ఒక సంస్కరణ జరుగుతుంది. మరియు ఆయన దానిని వాగ్దానము చేశాడు, మరియు అది దానిని చేస్తుంది.

110 ఇప్పుడు మనము వీటికి యోగ్యులము కాదు. దేవునియొక్క ఈ దీవెనలకు మనం పాత్రులము కాదు, ఎందుకంటే మనం లోకకార్యముల వెంట వెళ్ళాము, కయీనుయొక్క తప్పుత్రోవలో వెళ్ళాము. కయీను, ఒక మంచి బలిపీఠమును మరియు ఒక మంచి సంఘమును కట్టాడు, మరియు దాని మీద పువ్వులను పెట్టాడు, మరియు అది ఖచ్చితంగా అదేనని అనుకున్నాడు, "అది ఒక గంపెడు యాపిల్ పండ్లని అనుకున్నాడు లేదా పియర్స్ పండ్లని, లేదా దానిమ్మ పండ్లని, లేదా అది ఏమిటో అది అనుకున్నాడు," తన తండ్రి మరియు తల్లి ఏదెను తోటలో తిన్నది వాటినే అని, వారిని బయటకు తరిమినది అవేనని అనుకున్నాడు. మరియు కాబట్టి అతడు దేవునికి తిరిగి వాటినే అర్పించాడు, మరియు దేవుడు దానిని

తిరస్కరించాడు.

111 “అయితే హేబెలు విశ్వాసము ద్వారా కయీను కంటే శ్రేష్ఠమైన బలిని దేవునికి అర్పించాడు.”

112 మరియు, ఈనాడు, యూదా పుస్తకంలో బైబిలు ఇట్లు చెప్పినది, అదేమిటంటే, “వారు కయీను మార్గములో పరుగెత్తారు; కోరహు చేసినట్టు తిరస్కారము చేసి నశించిపోయారు.” చూడండి, “కయీను మార్గములో పరుగెత్తారు,” బలిపీఠములను కడుతూ, సంఘాలను కడుతూ, సంఘశాఖలను కడుతూ, దానిని ఆడంబరముగా, పెద్దగా, ఆ మిగతావారి కంటే అధిక సభ్యులు గలదిగా చేస్తూ; దారిన వచ్చే దేనినైనా లోపలికి అనుమతిస్తూ, మరియు పైకి క్రిందకి గెంతి, లేదా కరచాలనము చేసి, లేదా ఒక ఫలానా విధానములో బాప్తిస్మము పొంది, లేదా భాషలతో మాట్లాడి, నేల మీద దొర్లే ప్రతిఒక్కరి పేరును, వారు పుస్తకంలో వ్రాస్తారు. అది నిజము. మరియు పిదప ప్రకటించబడుతున్న నిజమైన సత్యానికి ఎదురుతిరిగి, మరియు దానిని తిరస్కరిస్తారు. అది ఆ విధంగా ఎలా జరుగగలదు? మనమెటువంటి ఒక గందరగోళంలో ఉన్నామో గమనించండి! గమనించండి.

113 మరియు బైబిలు ఇట్లు చెప్పినది, “మరియు వారు బిలాము నడచిన త్రోవను పోయిరి, మరియు కోరహువలె తిరస్కారము చేసి నశించిరి.” తిరస్కారము చేసి నశించిరి! కోరహుయొక్క తిరస్కారము ఏమిటి? “ఏంటీ, నీవొక్కడవే పరిశుద్ధుడవని నీవు అనుకుంటున్నావా? అంతెందుకు, దేవునియొక్క--- మేమందరమూ పరిశుద్ధులమే. సంఘమంతా బాగానే ఉన్నది. ప్రతి--- మనమందరము కలిసిపోదాము, మనము దానినే చేయవలసియున్నాము.” వారు నశించినది అక్కడే, అక్కడేయైయున్నది. మరియు మనము నిజంగా దానికి తగినవారమైయున్నాము. మనము దానికి పాత్రులమైయున్నాము.

114 కానీ దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, ఆ గందరగోళమునుండి మనల్ని బయటకు లాగాడు మరియు ఇక్కడ ఆ విషయము రాడానికిముందు మనం దానిని చూద్దాము. ఆయనయొక్క కరుణయందు సంపన్నుడైయున్నాడు, మరియు దైవిక స్వస్థతయొక్క ఉజ్జీవమును తిరిగి మనకు పంపించాడు, మరియు దేవుని శక్తిని మరలా పంపించాడు. చరిత్ర ప్రకారంగా, ఏ ఉజ్జీవము కూడా మూడు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం ఉండలేదు. ఈ ఉజ్జీవము పదిహేను సంవత్సరాలుగా కొనసాగుచున్నది, ఇది ప్రపంచవ్యాప్తంగా, ఒక మండుచున్న అగ్నియైయున్నది. ఎందుకని, మనం దానికి తగినవారమనా? దేవుడు, ఆయనయొక్క కరుణయందు సంపన్నుడు గనుకనైయున్నది, మనము దానిని కోరుకున్నామనో లేదా, మనము దానికి తగినవారమనో కాదు. అది ఏమి చేసినదో ఒకసారి ఆలోచించండి!

115 సరిగ్గా ఇక్కడ ఫీనిక్సుకు చెందియున్న మీ సహోదరీలలో ఒకరి గురించి నేను ఆలోచిస్తున్నాను, ఆమె మీలో చాలామందికి తెలుసు, శ్రీమతి. హ్యాట్టీ వాల్డ్రాప్, ఆమె గుండె క్యాన్సరును కలిగియున్నది. మరియు దాదాపు పదిహేను, పద్దెనిమిది సంవత్సరాల క్రితం నేను మరియు సహోదరుడు మూర్ ఇక్కడికి వచ్చిన మొదటి సారి, ఆమె ఇక్కడ ప్రార్థనా వరుసలో ఉన్నది. మరియు ఆమె, గుండె క్యాన్సరుతో చనిపోవుచున్నది, మరియు ఆమె చాలా కాలం క్రితమే చనిపోవలసియున్నది.

కానీ దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, దేవుడు ఆయనయొక్క శక్తిని ఆమె మీదకు పంపించాడు. మరియు ఆయన ఆమె ప్రాణాన్ని రక్షించాడు, మరియు ఇప్పుడు ఆమె బ్రతుకుచున్నది. కరుణా సంపన్నుడగు దేవుడు!

116 కాంగ్రెస్ సభ్యుడు అప్షా, ఒక గొప్ప వ్యక్తి. ఒకానొక సమయములో, అతడు ఆ——ఆ బ్యాప్టిస్టు, సదరెన్ బ్యాప్టిస్టు కన్వెన్షన్ కు అధ్యక్షుడో, లేదా మరేదో అయ్యున్నాడని నేను అనుకుంటున్నాను, లేదా వైస్-ప్రెసిడెంటో లేదా మరేదో అయ్యున్నాడు. అతడు అన్నీ చేశాడు. అతడొక మంచి వ్యక్తియైయున్నాడు. ఎలా చేయాలని అతడు ఎరిగియున్న దానంతటినీ అతడు చేశాడు. అతడు ప్రతియొక్క వైద్యుని దగ్గరకు వెళ్ళాడు. ఎవ్వరూ అతని కొరకు ఏమీ చేయలేకపోయారు. అతడు పూర్తిగా చక్రాల కుర్చీకి పరిమితమైపోయాడు. సేవకులు అతని కొరకు ప్రార్థించారు. ప్రతిచోటా ఆయా సేవకులు, అతని తల మీద లీటర్ల కొలది నూనెను పోసి, అభిషేకించారు.

117 ఒక రాత్రి, కాలిఫోర్నియా, లాస్ ఏంజిల్స్ లో, ప్రసంగ వేదిక పైకి నడుచుకుంటూ వచ్చాను, అక్కడ కూర్చున్న వారికంటే, రెండు, మూడు రెట్లు ఎక్కువ చక్రాల కుర్చీలు కనిపించాయి, అవి ఆ వరుసల మధ్యలో పైనుండి-క్రిందివరకు, వెనుక మరియు ముందు అంతటా ఉన్నాయి. మరియు పిదప అక్కడ ఒక మంచం ఉన్నది దానిలో ఒక చిన్న నల్లజాతి పాప ఉన్నది, చిన్న నీగ్రో పాప ఉన్నది, మరియు ఆమె——ఆమె తల్లి ఆమె ప్రక్కన కూర్చొనియున్నది. మరియు నా సహోదరుడు ప్రార్థనా వరుసను తీసుకొని వస్తున్నాడు.

118 మరియు ఏమి జరుగుతుందో ఎరుగకనే, నేను చూస్తూ ఉన్నాను. మరియు తాబేలు-చిప్పవంటి ఫ్రేమ్ గల కళ్ళద్దాలను పెట్టుకున్న, ఒక వైద్యుడు, ఒక చిన్న నీగ్రో పాపకు, గొంతు సమస్య కొరకు శస్త్రచికిత్స చేయడాన్ని నేను చూశాను, మరియు ఆమెకు పక్షవాతం వచ్చినది. మరియు నేను చుట్టూ చూశాను, "ఆ పాప ఎక్కడుంది?" అని నేను అనుకున్నాను. నాకు ఆమె కనబడలేదు.

119 కొద్దిసేపైన తర్వాత, చాలా వెనుక భాగములో, ఎటువంటి నిరీక్షణ లేకుండా, ఇక జీవితాంతం పక్షవాతంతోనే ఉండవలసిన పరిస్థితిలో ఉన్న, ఏడు లేదా ఎనిమిది సంవత్సరాల వయస్సు గల ఒక అందమైన చిన్న అమ్మాయి కనిపించినది. మరియు అక్కడ ఆ దిగువున ఆమె తల్లి మోకాళ్ళ మీద ఉండి, ప్రార్థిస్తూ ఉన్నది. అప్పుడు నేను, "ఈ వైద్యుడు నీ చిన్న బిడ్డకు ఆపరేషన్ చేశాడు" అని చెప్పాను, మరియు దానిని వివరించాను.

"అయ్యా, అది నిజము," అని ఆమె చెప్పినది.

120 అప్పుడు ఆమె ఆ బిడ్డను వేదిక దగ్గరకు తీసుకురాడానికి ప్రయత్నించినది. అలా చేయవద్దని వారు ఆమెకు చెప్పారు. ఆమెను ఊరుకోబెట్టడానికి వారు ప్రయత్నించారు. వారు ఆమెను నిమ్మళపరిచే సమయానికి, నేను ఇట్లనుకున్నాను, "సరి, మనము ఆమెకు ప్రార్థించే అవకాశమును తీసుకుందాము." కొద్ది నిమిషాల్లోనే...బహుశా సరిగ్గా ఇప్పుడు ఇక్కడున్నవారు ఆ రాత్రి అక్కడ ఉండవచ్చును.

121 మరియు నేను బయట జనసమూహములో చూస్తున్నాను, ఆ చిన్న అమ్మాయి క్రిందకు వెళ్ళడాన్ని నేను చూశాను, ఒక——ఒక చిన్న సన్నని దారివలె

కనిపించినది, తన చేతుల్లో ఒక చిన్న బొమ్మను పట్టుకొని, ఆ బొమ్మను లాలిస్తూ వెళ్తున్నది. ఆమె తన మిగతా జీవితమంతా పక్షవాతముతోనే ఉండబోతున్నదని వైద్యుడు ఎంతగా చెప్పినా గానీ; దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, ఒక దర్శనము ద్వారా, పరిశుద్ధాత్మను పంపించాడు, మరియు ఆ చిన్న అమ్మాయి అక్కడ నుండి పైకి లేచినది, ఆమె మరియు ఆమె తల్లి చేతులు పట్టుకొని మరియు దేవుణ్ణి స్తుతిస్తూ, ఆ వరుస మధ్యనుండి నడుచుకుంటూ వెళ్ళిపోయారు.

122 ఆ వెనుక అక్కడ ఒక వృద్ధుడు కూర్చొనియున్నాడు, కాంగ్రెస్ సభ్యుడు అప్షా, అతని సాక్ష్యం మీలో చాలా మందికి తెలుసు. అతడు ఒక మంచి వ్యక్తిగా ఉన్నాడు, తన జీవితమంతా ప్రయత్నించాడు, అరవై-ఆరు సంవత్సరాలు ఒక వికలాంగుడిగా చక్రాల కుర్చీలో ఉన్నాడు, మంచం మీద పడుకోబెట్టబడేవాడు; అతడు తన చంక కర్రలతో నడవడమే తప్ప, మరెన్నడూ మాములుగా నడిచే స్థితిలో లేడు. మరియు అతడు అక్కడ కూర్చొని, దానిని చూస్తూ ఉన్నాడు. మరియు అకస్మాత్తుగా, నేను చూడగా ఒక దర్శనము కనబడినది. ఇదిగో అతడు, ఆ జనసమూహాము మీదుగా నడుచుకుంటూ వచ్చి, తన శిరస్సును వంచి, మిగతావారి లాగానే ఎంతో చక్కగా నడవగలిగియున్నాడు. ఆ వ్యక్తి ఎవరో నాకు తెలియలేదు.

123 నేను ఇట్లు చెప్పాను, "అక్కడ వెనుకాల ఒక గొప్ప వ్యక్తి కూర్చొనియున్నాడు. అతడు ఒక చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు ఒక బండి మీదనుండి, ఒక గడ్డివాము మీదకు పడ్డాడు, మరియు తన వెన్నుకు గాయమైనది. ప్రజలు నడిచినప్పుడు, ఆ కంపనములు, అతని వెన్నుకు తగులకుండా ఉండటానికి, వారు నేలలో రంధ్రాలు వేశారు." నేను ఇట్లు చెప్పాను, "అతడు ఒక గొప్ప వ్యక్తి అవుతాడు, మరియు అతడు ఇంకా గొప్పగా ఎదుగుతాడు. అతడు వైట్ హౌస్ లోని గొప్ప వ్యక్తుల మధ్య కూర్చుంటున్నాడు."

124 మరియు అప్పుడు ఈ వ్యక్తి వచ్చి నాతో చెప్పాడు, ఇట్లన్నాడు, "అతడు కాంగ్రెస్ సభ్యుడు అప్షాయైయున్నాడు. అతని గురించి నీవు ఎప్పుడైనా విన్నావా?"

నేను ఇట్లు చెప్పాను, "అతని గురించి ఎన్నడూ వినలేదు."

125 మరియు కాబట్టి అతడు ఒక చిన్న పొడిగించిన అనుసంధానం గల మైకును ఆ వెనుకకు పంపించాడు మరియు వారు, అటు ఇటు మాట్లాడుతున్నారు.

126 అప్పుడు నేను చుట్టూ చూడటం మొదలుపెట్టాను, మరియు ఆ వృద్ధుడైన కాంగ్రెస్ సభ్యుడు రావడాన్ని, నా వైపు నడుచుకుంటూ రావడాన్ని, ఎంతో పరిపూర్ణముగా మరియు ఎంతో సాధారణముగా ఉండటాన్ని, ఒక దర్శనములో నేను చూశాను. దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, అతడిని ఆ చక్రాల కుర్చీలో నుండి లాగాడు, మరియు అతడు మరణించే రోజువరకు కూడా అతడు చంకకర్రలు లేకుండానే నడిచాడు. కరుణా సంపన్నుడైన దేవుడు! వైద్యులు విఫలమైయుండగా, విజ్ఞానశాస్త్రమునకు విఫలమైయుండగా, మిగతా ప్రతీది విఫలమైయుండగా, దేవుడు కాంగ్రెస్ సభ్యుడైన అప్షా పట్ల కరుణా సంపన్నుడైయన్నాడు.

127 నా గురించి నేను ఆలోచిస్తున్నాను. ఒక చిన్న పిల్లవాడిగా ఉన్నప్పుడు, నాకు గుర్తున్నది...ఈ రోజు ప్రజలు నన్ను, "ఒక స్త్రీ-ద్వేషకుడు" అని పిలుస్తారు. దానికి

కారణము ఏమిటంటే, నేను ఒక చిన్న పిల్లవాడిగా ఉన్నప్పుడు స్త్రీలలో ఎంతో అనైతికతను నేను చూశాను. నేను వాలిని ద్వేషించాను. మలియు ఇప్పుడు నేను దానిని చేయను, ఎందుకంటే మంచివారు కొందరు ఉన్నారని నాకు తెలుసు. కానీ అది ఎంత దారుణంగా, ఎంత అనైతికముగా ఉండేదో నాకు జ్ఞాపకమున్నది. మరియు నేను ఇట్లనుకున్నాను, "మై, ప్రజలు ఉన్న చుట్టుప్రక్కలలో నేను—నేను ఎన్నడూ ఉండను. నాకు ఎటువంటి విద్య లేదు, కాబట్టి నాకు అటువంటి చోటేదియు రాదులే."

128 మరియు ఒక చిన్న పిల్లవాడిగా అక్కడ కూర్చొనియున్నాను, కనీసం ఒక చొక్కా కూడా లేదు, ఒక పిన్నీసుతో, నా కోటుకు పైన ఈ విధంగా పిన్ను పెట్టబడియుంటుంది, మరియు చాలా వేడిగా ఉండేది. మరియు మా మేడమ్ ఇట్లన్నది, "విలియమ్, నీవు ఆ కోటును వేసుకుంటే నీకు ఉడకపోయడంలేదా?"

129 అందుకు నేను, "లేదు, మేడమ్, నాకు కొద్దిగా చల్లగా ఉంది" అని చెప్పాను. మరియు ఆమె నన్ను ఒక పొయ్యి దగ్గరకు పంపించి దానిలో కొన్ని కట్టెలను పెట్టించి అక్కడ కూర్చోబెట్టింది, మరియు నాకు వేడికి కాలినట్లుగా అయిపోయినది. మరియు ఆ ఋతువుంతటిలో కూడా నాకు—నాకు ఎటువంటి చొక్కా లేదు.

130 మరియు నేను ఇట్లనుకున్నాను, "నేనెప్పుడైనా డబ్బు సంపాదించినట్లైతే, ఏదో ఒక సమయములో నేను నా కొరకు, ఒక చిన్న ముప్పై-మూడు తుపాకీనీ కొనుక్కోగలిగితే," నేను ఇక్కడ పశ్చిమమునకు వచ్చి మరియు ఇక్కడే బ్రతుకుతూ, మరియు నా మిగతా జీవితమంతా వేటాడుకుంటూ ఉంటాను. ప్రజలతో నేను ఎటువంటి సంబంధము కలిగియుండాలని కోరలేదు. కేవలం దూరంగా ఉండటమే, ఎందుకంటే వారికి నేను నచ్చలేదు, మరియు—మరియు నేను కేవలం వారికి దూరంగా ఉండేవాణ్ణి.

131 మరియు పిదప నేను టౌనుకు వెళ్ళిన ప్రతిసారీ, ఎవరితోనైనా మాట్లాడటానికి వెళ్ళినప్పుడు, నాకు తెలిసిన ఎవరినైనా, వీధిలో చూసినప్పుడు, నేను ఇట్లనేవాణ్ణి, "హలో, జాన్, జిమ్! మీరు ఎలా ఉన్నారు?"

"ఓ, హలో."

132 చూడండి, వారు నాతో మాట్లాడటానికి ఇష్టపడేవారు కాదు, నాతో ఏ సంబంధమూ పెట్టుకోవాలని అనుకునేవారు కాదు, ఎందుకంటే మా నాన్నగారు మరియు వారు విస్కీ తయారుచేసేవారు. మరియు నేను—నేను దానిని చేయలేదు. అది నేను చేసినది కానే కాదు. మరియు నేను ఆ విధంగా ఉండిపోయేవాణ్ణి.

133 కానీ ఇప్పుడు నేను ఈ మధ్యనే, నేను నా భార్యతో ఇట్లన్నాను, "కొనగలిగే అత్యుత్తమమైన తుపాకులతో నా గోడ నిండిపోయి ఉన్నది." ఓ, మరియు నేను ఆ మురికి బట్టల గురించి ఆలోచిస్తూ ఉంటాను. ఈ రాత్రి నాకు రెండు లేదా మూడు మంచి సూట్లు ఉన్నాయి. మరియు స్నేహితులారా? ప్రజల నుండి దూరంగా ఉండటానికి, నేను అరణ్యములో దాగుకోవలసియున్నది. విషయమేమిటి, అది నా వ్యక్తిత్వమును బట్టా, అది నా విద్యను బట్టా? కాదు. దేవుడు, కరుణా

సంపన్నుడైయుండి, నన్ను ఆ స్థితిలో చూశాడు మరియు ఆయన నన్ను రక్షించాడు.

134 ఒక గ్రుడ్డి వ్యక్తిగా, నేను చేతులు పట్టుకొని నడిపించబడటం నాకు జ్ఞాపకమున్నది. నేను చూడలేకయున్నాను. నా ముందున్న ప్రతీది మసకగా కనిపించేది; నా మిగతా జీవితమంతా నేను గ్రుడ్డివానిగా ఉండిపోయేవాణ్ణి. కానీ దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, నా దృష్టిని మరలా నాకు ఇచ్చాడు. నాకు యాభై-ఐదు సంవత్సరాలు, మరియు నేను ఇప్పటికీ మంచి చూపును కలిగియున్నాను. కరుణా సంపన్నుడైన, దేవుడే, దానికి కారణమని నేను చెప్పగలను.

135 ఒకప్పుడు స్వస్థత కొరకు సంఘమునకు ఎటువంటి మార్గము లేదు. వారు ఒకదానిని కలిగియున్నారు, కానీ వారు దానిని తృణీకరించారు. కానీ దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, వారికి ఒక దైవిక స్వస్థత వరమును పంపించాడు. అది వెంబడిస్తున్న సూచనల ద్వారా వాక్యమును నిర్ధారిస్తూ, మన మధ్యనున్న పరిశుద్ధాత్మయై యున్నది. కరుణా సంపన్నుడైన దేవుడు!

136 నేను ఇక్కడ రెండు లేదా మూడు పేజీల నోట్సును కలిగియున్నాను, కానీ నేను వాటిని మాట్లాడటానికి ప్రయత్నించబోవడంలేదు, ఎందుకంటే ఇప్పుడు దాదాపు ఆ ప్రార్థనా వరుసను మొదలుపెట్టాల్సిన సమయమైందని నాకు—నాకు తెలుసు. అయితే దేవుడు కరుణాసంపన్నుడై యున్నాడు!

137 ఈ రాత్రి ఇక్కడున్న మీలో చాలామందిని, వైద్యులు వదిలేశారు. ఆ చక్రాల కుర్చీలలో కూర్చొనియున్న ప్రజలు ఉన్నారు, వారు బహుశా ఎన్నడూ అక్కడనుండి బయటకు రాకపోవచ్చును. వారు అక్కడే ఉండవలసియున్నారు. వారిలో కొందరు, రకరకాలుగా పక్షవాతముతో ఉన్నారు, వారు (ఎన్నడూ లేవలేరు) ఆ స్థితినుండి బయటకు రాలేరు, వారు బయటకు రావడానికి ఏ మార్గము లేదు. కానీ దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, ఒక ప్రాయశ్చిత్తమును ఏర్పాటు చేశాడు. దానిని త్రోసివేయవద్దు. దానిని స్వీకరించండి. గుండె జబ్బుతోనున్న వ్యక్తిలు అక్కడున్నారు, వైద్యులు అసలేమియు చేయలేనటువంటి, క్యాన్సర్లతో ఉన్న ప్రజలు ఉన్నారు. ఈ లోకంలో, మీరు నిరీక్షణ లేకుండా, నిస్సహాయ స్థితిలో ఉన్నారు.

138 కానీ దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, పరిశుద్ధాత్మను పంపించాడు, మరియు వాక్యమును నిర్ధారించడానికి, ఆయన నిన్నా, నేడు, మరియు నిరంతరం ఒక్కటేరీతిగా ఉన్నాడని ఋజువు చేయడానికి సరిగ్గా ఇప్పుడు ఇక్కడ ఉన్నాడు. మనం దానికి పాత్రులమైయున్నందుకా? దేవుడు కరుణాసంపన్నుడు గనుకనైయున్నది! ఆమేన్. ఇప్పుడు అది ఆయనే, ఆ వ్యక్తి ఆయనే, అది ఆ ప్రభువైన యేసుక్రీస్తే. ఆయన మృతుడు కాదు, కానీ ఆయన మృతులలో నుండి లేచియున్నాడు, మరియు ఆయన నిత్యమూ సజీవుడైయున్నాడు.

139 ఆయన నిన్నా, నేడు, మరియు నిరంతరము ఒక్కటేరీతిగా ఉన్నాడు, రక్తస్రావ రోగముగల ఆ స్త్రీ పట్ల ఆయన ఎంత కరుణాసంపన్నుడై యున్నాడో ఆయన ఇంకను అంతే కరుణాసంపన్నుడై యున్నాడు. మరి ఆమె గుంపులో నుండి వస్తున్నది. అమెకు ఎటువంటి నిరీక్షణలు లేవు, వైద్యులు తాము

చేయగలిగినదంతా చేశారు. ఆమెకు రక్తస్త్రావ రోగము ఉన్నది. ఆమె మరణమౌతున్నది. మరి ఆమె యజమానుని వస్త్రమును తాకినది. దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, వెనుకకు తిరిగి ఆమె పరిస్థితిని ఆమెకు తెలియజేశాడు. మరియు ఆమె ఈ రక్తస్త్రావము నుండి స్వస్థత పొందుకున్నది.

140 ఒక రోజు ఒక చిన్న, చెడ్డ వ్యభిచారి, కొన్ని నీళ్ళు తెచ్చుకోడానికి బావి దగ్గరికి వెళ్ళినది. ఏ నిరీక్షణ లేకయున్నది. కన్యల మధ్యనుండి, ప్రజల మధ్యనుండి ఆమె వెలివేయబడినది, ఆమె జీవితము ఏ మాత్రము బాగోలేదు. మరియు ఆమె ఇట్లనుకున్నది, "ప్రయత్నించి మాత్రం ఏం ప్రయోజనం? నేను త్రోసివేయబడ్డాను, నాకు ఇక ఏమీ మిగిలిలేదు." అయితే ఆమె చూడగా, ఆ ప్రక్కగా, లేదా ఆ బావి మీద ఒక ప్రక్కన కూర్చొనియున్న ఒకరు కనిపించారు, మరియు ఆమె చేసినవన్నీ ఆమెతో చెప్పిన ఒక వ్యక్తి అక్కడ కూర్చొనియున్నాడు, కరుణా సంపన్నుడైన దేవుడు.

141 అదే దేవుడు, ఆ రోజుల్లో ఆయన ఎంత కరుణా సంపన్నుడైయున్నాడో, ఈ రాత్రి కూడా, ఆయన అంతే కరుణా సంపన్నుడైయున్నాడు. దేవుడు సంపన్నుడైయున్నాడు. [టేపులో ఖాళీ ఉన్నది—సంపా.]

142 మనకిక్కడ రెండు వందల ప్రార్థనా కార్డులు ఉన్నాయని, లేదా రెండు వందలలో మనం పిలిచినంతవరకు ఇక్కడ ఉన్నారని నేను అనుకుంటున్నాను. మనం వారిని పిలవబోతున్నాము మరియు ప్రజలను వరుసలో నిలబడనీయండి. మనం వారి కొరకు ప్రార్థించబోతున్నాము.

143 అయితే మనం దానిని చేయడానికి ముందు, క్రొత్తగా వచ్చినవారు కొందరు ఇక్కడ ఉండవచ్చునని, మూఢనమ్మకాలన్నిటి నుండి తొలగించడానికి చెప్తున్నాను. ఇది ఒక మూఢనమ్మకం కాదు. ఇది దేవుని వాగ్దానముయొక్క కార్యరూపణయైయున్నది. అది మీరు దేనివైపు చూస్తున్నారన్నదాని మీద ఆధారపడియుంటుంది. ఏ మనుష్యునిలోను ఎటువంటి ప్రభావం లేదు. ఏ మనుష్యునిలోను ఎటువంటి శక్తి లేదు. అయితే విశ్వాసులుగా మనము అధికారమును కలిగియున్నాము; శక్తిని కాదు, కానీ అధికారమును కలిగియున్నాము.

144 ఈ మధ్యనే, ఒకరు నన్ను ఇట్లడిగారు, ఇట్లన్నారు, "సహోదరుడా బ్రెన్హామ్, దీనిని చేయడానికి నీవు శక్తిని కలిగియున్నావని నీవు నమ్ముతున్నావా?"

145 నేను ఇట్లు చెప్పాను, "నేను అసలు, ఎటువంటి శక్తిని కలిగిలేను, కానీ నేను అధికారమును కలిగియున్నాను." ప్రతి విశ్వాసి దానిని కలిగియుంటాడు. మీరు గనుక దానిని తృణీకరిస్తే, మీరెక్కడున్నారో అక్కడే ఉండిపోతారు. కానీ మీరు దానిని స్వీకరిస్తే, అది అత్యధికమైన గొప్ప కార్యములను చేస్తుంది, ఎందుకంటే దేవుడు ఆయనయొక్క కరుణయందు సంపన్నుడైయున్నాడు.

146 బయట ఇక్కడ వీధిలో నిలబడియున్న ఒక పోలీసును తీసుకోండి, అతడెంతో బక్కగా ఉండి, మరి అతని దుస్తులు వదులుగా వ్రేలాడుతూ ఉండవచ్చును. ఆ టోపీ వలన ఆయన చెవులు క్రిందికి వంగియుండవచ్చును. మరియు మూడు వందల హార్స్ పవర్ల మోటర్లతో, గంటకు యాభై మైళ్ళ వేగంతో కార్లు తిరుగుతున్న ఆ వీధిలోకి, అతడు నడుచుకుంటూ వస్తాడు. అతనికి కనీసం ఒక సైకిలును ఆపే శక్తి

కూడా లేదు. అది నిజం. అయితే కేవలం అతణ్ణి ఆ ఈలను ఊదనిచ్చి మరియు ఆ చేతిని చాపనీయండి, మరప్పుడు బ్రేకుల కీచు శబ్దాన్ని గమనించండి. అతడు శక్తిని కలిగిలేడు, కానీ అతడు అధికారమును కలిగియున్నాడు. ఆ పట్టణమంతా అతని వెనుక ఉన్నది.

147 మరియు ఒక పురుషుడు లేదా ఒక స్త్రీ, మీరు ఎటువంటి స్థితిలో ఉన్నారో నేను లెక్కచేయను, ఒక వాగ్దానమూలముగా, మీరు దేవుని అధికారాన్ని కలిగియున్నారు, ఎందుకంటే ఆయన సంపన్నుడైయుండి అత్యధికముగా చేస్తానని వాగ్దానము చేశాడు. "మీరు ఈ పర్వతముతో 'కదిలిపొమ్ము' అని చెప్పి, మరియు మీ హృదయములో సందేహింపక, మీరు చెప్పినది జరుగునని నమ్మినయెడల, మీరు చెప్పినదానిని మీరు పొందుకోవచ్చును." మీరు ఎటువంటి శక్తిని కలిగిలేరు, కానీ మీరు అధికారమును కలిగియున్నారు.

148 ఆ వెనుక ఆయన నాతో చెప్పినది జ్ఞాపకమున్నదా, ఇట్లు చెప్పాడు, "నీవు హృదయ రహస్యములను బయలుపరచగలుగుతావు." ఏలయనగా ఆయన... మీకు అది గుర్తుందా, ఫీనిక్సు ప్రజలైన మీలో అనేకులకు అది గుర్తుందా? ఆయన దానిని వాగ్దానము చేశాడు. ఆయన వాగ్దానము చేసినదానిని, ఆయన నెరవేర్చుతాడు.

149 ఇప్పుడు మీలో ప్రార్థనా కార్డులు లేని కొందరు ఇక్కడున్నారు, మరియు ఎటువంటి సందేహము లేదు. అనారోగ్యముతో ఉండి ప్రార్థనా కార్డులు లేనివారు ఎంతమంది ఉన్నారు? మీ చేతులు పైకెత్తండి. నిశ్చయంగా. మంచిది. మీరు తెలుసుకోవాలనుకుంటే, అధికారము కాదు...శక్తి కాదు, కానీ వాక్యముయొక్క అధికారము, "నేను చేయు కార్యములు మీరును చేయుదురు."

150 లూకా 17:30లో, యేసు వాగ్దానము చేశాడు, అదేమిటంటే సరిగ్గా ఆయనయొక్క రాకడకు ముందు, మోషే...లేదా నోవహు కాలమువంటి ఒక కాలము ఉంటుంది, "అప్పుడు వారు తినుచు త్రాగుచూ, మరియు పెండ్లికియ్యబడుచు ఉన్నారు; మరియు నోవహు ఓడలోనికి ప్రవేశించు దినమువరకు ఎరుగకయున్నారు." అటువంటి సమయము ఉంటుందని ఆయన చెప్పాడు. పిదప, "లోతు దినములలో జరిగినట్లే," అని కూడా ఆయన చెప్పాడు, మరియు ఇట్లు చెప్పాడు, "మనుష్యకుమారుడు ప్రత్యక్షపరచబడు ఆ దినమున ఇది జరుగుతుంది, అంత్య దినములలో మనుష్యకుమారుడు ప్రత్యక్షపరచబడినప్పుడు జరుగుతుంది."

151 ఇప్పుడు ఏమిటో చూడండి ఆయన, మనుష్యకుమారుడు ఈ దూతయొక్క వ్యక్తిలో తననుతాను ఏ విధంగా ప్రత్యక్షపరచుకున్నాడో చూడండి, మరి ఆయనే మనుష్యకుమారుడైయున్నాడు. ఖచ్చితంగా. అబ్రాహాము ఆయనను "ఎలోహీం" అని పిలిచాడు. ఆయన మనుష్యకుమారుడైయున్నాడు, సరిగ్గా అన్యజనుల ప్రపంచము దహించివేయబడుటకు ముందు తననుతాను బయలుపరచుకున్నాడు. ఆయన దానిని ఎలా చేశాడు? విశ్వాసికి చేశాడు. వేష-ధారికైతే, వారికి బోధించడానికి ఆయన ఇద్దరు బోధకులను అక్కడికి పంపించాడు. కానీ ఒక నిజ విశ్వాసికైతే, ఆయన తన వీపును గుడారము తట్టుకు త్రిప్పుకొని నిలబడియున్నాడు, మరియు ఆయన ఇట్లన్నాడు, "అబ్రాహామా." ఆ

రోజు...దానికి కొన్ని రోజుల ముందు, అతడు అబ్రాము అయ్యున్నాడు. కానీ ఇప్పుడు అతడు అబ్రాహాముయై యున్నాడు. "నీ భార్యయైన శారా, ఎక్కడ?"

152 అతడిట్లు చెప్పాడు, "ఆమె నీ వెనుకనున్న, గుడారములో ఉన్నది."

153 ఆయన ఇట్లన్నాడు, "నేను నీకు చేసిన నా వాగ్దానమును నిలబెట్టుకోబోతున్నాను. నేను నిన్ను దర్శించబోతున్నాను."

154 ఓ, అబ్రాహాము వంద సంవత్సరముల వయస్సు గలవాడు, మరియు శారాకు తొంభై సంవత్సరాలు; కానీ దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, తన వాగ్దానమును నిలబెట్టుకున్నాడు. అది ఆ బిడ్డను తెచ్చినది, ఎందుకంటే దేవుడు కరుణగలవాడు, మరియు ఆయన కరుణతో నిండియున్నాడు. ఆయన కరుణాసంపన్నుడై యున్నాడు. ఆయన తన వాగ్దానమును నిలబెట్టుకుంటాడు.

155 గమనించండి, ఆయన వీపు గుడారము వైపునకు ఉండగా, శారా నవ్వి మరియు ఇట్లన్నది, "ఈ సంగతులు ఎలా సంభవించగలవు? నేను ముసలిదానను. వివాహమైన ఒక యవ్వనస్త్రీ వలె, నా భర్తతో నేనెలా సుఖము పొందగలను? అంతెందుకు, అతడు ఒక వంద సంవత్సరముల వయస్సు గలవాడు. మా దాంపత్య జీవితం, అనేక సంవత్సరాల క్రితమే, ఆగిపోయినది. ఇది ఎలా సాధ్యమౌతుంది?" మరియు దాని గురించి ఆమె నవ్వినది.

156 మరియు ఆ దూత...ఆ మనుష్యకుమారుడు తన వీపును గుడారము తట్టుకు—తట్టుకు త్రిప్పుకొనియుండగా, ఇట్లన్నాడు, "'ఈ సంగతులు ఏలా జరుగగలవు' అని చెప్పి, శారా ఎందుకని నవ్వినది?"

157 అది ఏమిటి? పరిశుద్ధ లూకా 17:30 లో, యేసు ఇట్లు చెప్పాడు, "లోతు దినములలో జరిగినట్లుగా జరుగుతున్న దినములలో," అన్యప్రపంచం దహించివేయబడుటకు ముందు, అదే పరిస్థితి ఉంటుంది, ఆయన ఇట్లు చెప్పాడు, "ఆ దినమున మనుష్యకుమారుడు తననుతాను బయలుపరచుకుంటాడు." ఆయన వాగ్దానం చేశాడు, మలాకీ 4 లో మనకు వాగ్దానము చేయబడి ఇట్లు చెప్పబడినది. ప్రజలను తిరిగి పెంతెకొస్తు వర్తమానము నొద్దకు పునరుద్ధరించే ఒక వర్తమానము బయలువెళ్తుంది, మరియు ఆ దినమున వారు కలిగియున్న అవే ఆశీర్వాదములతో అది వస్తుంది...అది ఏమిటి? అది క్రొత్త మరియు పాత నిబంధనలతో రెండిటితో కూడిన, రెండు రెక్కలు-గల పక్షిరాజైయున్నది, అది ఏమి చేస్తుందని బైబిలుయొక్క వాగ్దానములు చెప్పినవో వాటిని నెరవేర్చడానికి, దేవునియొక్క వాగ్దానములనే రెక్కలను ఏకముగా ఆడించుచున్నది.

158 దేవుడు, కరుణా సంపన్నుడైయుండి, తన ప్రజలను బయట ఈ సంఘుశాఖపరమైన దానిలోనికి వెళ్ళనివ్వలేదు, "వస్తు సంపదలతో మరియు లోకసంగతులతో నిండియున్న," లవొదికయ సంఘుకాలముతో వెళ్ళనివ్వలేదు, కానీ ఆయన ఒక తప్పించుకునే మార్గమును ఏర్పాటు చేశాడు. ప్రజలారా, దానిని నమ్మండి. దేవుడు మిమ్మల్ని దీవించును గాక. ఆమేన్. కరుణాసంపన్నుడైన దేవుడు! దేవునియొక్క కనికరములు, మరి వాటిని మాత్రమే నేను కోరుచున్నాను. ఆయన నీతిని కాదు, ఆయన ధర్మశాస్త్రాన్ని కాదు; కానీ ఆయనయొక్క కనికరము కొరకే నేను వేడుకొనుచున్నాను. దేవా నా యెడల కనికరము చూపుము. మనందరి భావన అదేయైయున్నది.

159 నేను గమనిస్తూ ఉన్నాను. బయట ఇక్కడ సీటు చివరన ఒక చిన్న స్త్రీ కూర్చొనియున్నది. అమ్మా, బయట అక్కడ నీవు ఒక ప్రార్థనా కార్డును కలిగియున్నావా? నీవు కలిగిలేవు. దేవుడు కరుణాసంపన్నుడని నీకు చూపించనివ్వు. ఈ మధ్యన నీవెంతో ఉద్రిక్తతతో ఉన్నావు, కాదా? చాలా దారుణమైన స్థితిలో ఉన్నావు, మరియు నీ కళ్ళు కూడా పాడైపోయినవి. అది నిజము కాదా? అది నిజమే. ఇప్పుడు అవి మారబోతున్నాయి. దేవుడు, ఆయనయొక్క కరుణయందు సంపన్నుడైయుండి, నీవు దీనిని నమ్ముతావా అని నిన్ను అడగడం ద్వారా దానిని చేస్తాడు. ఇప్పుడు నీ దగ్గర ప్రార్థనా కార్డు లేదు. నీ దగ్గర ఏమీ లేదు; అయితే నీకు అది అవసరం కూడా లేదు. చూడు, అది నీకు అనుగ్రహించబడిన కృపయైయున్నది.

160 అక్కడ ముందు ఒక చిన్న వ్యక్తి కూర్చొనియున్నాడు, ఒక విధమైన---సరిగ్గా బయట ఇక్కడ కూర్చొనియున్నాడు. అతని శరీరముపై గడ్డవంటిది పెరగడంతో అతడు బాధపడుతున్నాడు. అది ఈ మధ్యనే అక్కడ ఏర్పడినది, ఈ మధ్యనే కలిగినది. అయ్యా, అది నిజము కాదా? అది నిజము. అదేమిటో నీకు తెలియదు. నీవు దానికి భయపడుతున్నావు. అది నిజము. అది ఒక దెబ్బవలన కలిగినది, కాదా? నీకు ఒక ప్రార్థనా కార్డు ఉన్నదా? నీకు ఎటువంటి ప్రార్థనా కార్డు లేదు. నీకు అవసరము కూడా లేదు. దేవుడు ఆయనయొక్క కరుణయందు సంపన్నుడైయున్నాడు!

161 ఓ, సహోదరుడా, సహోదరీ, దేవుణ్ణి నమ్మండి! ఆయనను సందేహించకండి. ఆయనను నమ్మండి! అది నిజము.

162 ఇక్కడ ఒక వ్యక్తి కూర్చొనియున్నాడు, బూడిద రంగు సూటు ధరించి, కళ్ళద్దాలు పెట్టుకొనియున్నాడు. అయ్యా, ఇటు చూడు. నీవు నమ్ముతున్నావా? దేవుడు కరుణా సంపన్నుడైయున్నాడు. నీవు హెర్నియా కలిగి ఇక్కడ కూర్చొనియున్నావు. దేవుడు ఆ హెర్నియాను స్వస్థపరచి నిన్ను బాగుచేయగలడని నీవు నమ్ముతున్నావా? సరిగ్గా ఈ సీటు చివరన కూర్చొని, నా వైపు చూస్తున్నావు. దేవుడు ఆ హెర్నియాను స్వస్థపరచగలడని నీవు నమ్మినట్లైతే, నీవు దానిని అంగీకరిస్తే దేవుడు నీకు దానిని చేస్తాడు. నీవు దానిని నమ్ముతున్నావా? నీవు దానిని అంగీకరిస్తావా? మంచిది. నీవు కేవలం దానిని నమ్మినట్లైతే, నీవు దానిని పొందుకోగలవు, కరుణను పొందుకోగలవు. అవును, అయ్యా.

163 ఇక్కడ ఒక స్త్రీ కూర్చొనియున్నది, తన శరీరంలో రక్తప్రసరణ సరిగా జరుగక ఆమె బాధపడుతున్నది. కానీ ఆమె నమ్మితే, దేవుడు ఆమెను స్వస్థపరుస్తాడు, ఆమె దానిని నమ్మినట్లైతే స్వస్థపరుస్తాడు. ఇతర విషయాల వలె ఆమె దీనిని పోగొట్టుకోబోతున్నదని, నేను అనుకుంటున్నాను. కరుణను చూపించుము, అన్నదే నా ప్రార్థనైయున్నది. ఆ స్త్రీ నాకు మసకగా కనబడుతున్నది---శ్రీమతి. రైలీ, ఆ బలహీనమైన రక్తప్రసరణను దేవుడు స్వస్థపరచగలడని నీవు నమ్ముతున్నావా? నీవు నమ్మినట్లైతే, దానిని పొందుకో! ఆమేన్. కేవలం నమ్మండి. దేవుడు మంచివాడు, స్టెల్లా, ఆయన మంచివాడు కాడా? అవును. అది నిజము. నేను ఆ స్త్రీని నా జీవితంలో ఎన్నడూ చూడలేదు. కానీ, దేవుడు, ఆయనయొక్క కరుణలో!

164 ఇదిగో మరొక స్త్రీ కూర్చొనియున్నది, సరిగ్గా ఆ వెనుక, వెనుక భాగంలో కూర్చొనియున్నది, సరిగ్గా నా వైపు చూస్తున్నది. ఆమె, కూడా అంతే, ఆమె

బలహీనమైన రక్తప్రసరణను కలిగియున్నది. ఇందాక ఆమె దాని గురించి ఆలోచిస్తున్నది. నా జీవితంలో నేను ఆ స్త్రీని ఎన్నడూ చూడలేదు. ఈ వేరొక స్త్రీ కూడా అదే కార్యమును కలిగియున్నందుకైయున్నది, నా వైపు చూడు. నేను దేవుని ప్రవక్తనని, లేదా ఆయన సేవకుడనని నీవు నమ్ముతున్నావా? నీకు గుండె సమస్య కూడా ఉన్నది. అది నిజమైతే, నీ చెయ్యి పైకెత్తు. ఇప్పుడు నీకది లేదు. దేవుడు, ఆయనయొక్క కరుణయందు సంపన్నుడైయుండి, ఈ రాత్రి ఆయన ఇక్కడ ఈ భవనంలో సజీవుడుగా ఉన్నాడని చూపిస్తున్నాడు. దేవుడు ఆయనయొక్క కరుణయందు సంపన్నుడైయున్నాడు! ఆమేన్.

165 పాపులైనవారు మరియు భక్తివిడిచి పడిపోయినవారు ఎంతమంది, లేచి నిలబడి, "కరుణా సంపన్నుడవైన, దేవా, నా యెడల కరుణ చూపుము" అని చెప్తారు? లేచి నిలబడండి. ఆయన...ఇప్పుడు మీకు కరుణ కావాలని మీరు నమ్మినట్లైతే, నేను మీ కొరకు ప్రార్థిస్తాను. దేవుడు నిన్ను దీవించును గాక. దేవుడు నిన్ను దీవించును గాక. దేవుడు నిన్ను, నిన్ను దీవించును గాక. పడిపోయినవాడా, లేచి నిలబడు. దేవుడు ఆయనయొక్క కరుణయందు సంపన్నుడైయున్నాడు! నీవు——నీవు...

166 అది ఈ ఘడియయొక్క వాగ్దానమైయున్నదని చూడలేనంతగా, మీరు ఈ స్థితిలో, నిశ్చయంగా అంత స్పర్శలేనివారిగా అవ్వలేదు. మీరు నిశ్చయంగా సంఘశాఖలలో, మరియు ఇతర కార్యములలో, ఇది ఈ ఘడియయొక్క వాగ్దానమైయున్నదని చూడలేనంతగా చుట్టబడిలేరు, దేవుడు కరుణా సంపన్నుడైయున్నాడు.

167 నిలవబడిన మీరు, ఎవరివైనప్పటికి, ఒక నిమిషంలో నేను ప్రార్థించబోతున్నాను. మీరు ఒక మంచి సంపూర్ణ సువార్త సంఘానికి వెళ్ళి మరియు——మరియు——మరియు క్రైస్తవ బాప్తిస్మములో బాప్తిస్మము పొందాలని నేను కోరుతున్నాను, దేవుడు మీకు పరిశుద్ధాత్మను అనుగ్రహించును గాక.

168 ఇంకెవరైనా లేచి నిలబడి, మరియు, "నేను, నేను జ్ఞాపకం చేసుకోబడాలని కోరుతున్నాను. దేవా, నీ కనికరములో, నన్ను జ్ఞాపకము చేసుకో. నేను జీవించవలసిన విధంగా నేను జీవించలేదు. ఒకవేళ..." అని చెప్తారా? స్త్రీ, దేవుడు నిన్ను దీవించును గాక. మరియు దేవుడు నిన్ను దీవించును గాక. దేవుడు నిన్ను దీవించును గాక. దేవుడు నిన్ను దీవించును గాక. దేవుడు నిన్ను దీవించును గాక. అది నిజము. "కరుణా సంపన్నుడవైన, దేవా, నాపై కరుణ చూపించుము." సహోదరి, దేవుడు నిన్ను దీవించును గాక. ఇంకెవరైనా...?

169 ఇక్కడున్నవారిలో ఇంకెంతమంది, ఇట్లు చెప్తారు, "నేను నిలబడతాను. నాకు కనికరం కావాలని దేవుడు తెలుసుకోవాలని నేను కోరుతున్నాను. నేను సరిగా జీవించలేదు. నేను *ఈ* విధంగా మరియు ఆ విధంగా జీవించాను. నా జీవితం ఒడిదుడుకులతో నిండియున్నది, కానీ నాకు ఆయన కరుణ కావాలి." సహోదరుడా, దేవుడు నిన్ను దీవించును గాక. "కరుణయందు సంపన్నుడవైన దేవా!" అని ఇంకెవరైనా చెప్తారా. సహోదరీ, దేవుడు నిన్ను దీవించును గాక. సహోదరీ, దేవుడు నిన్ను దీవించును గాక. అది నిజము. దేవుడు తనయొక్క కరుణయందు సంపన్నుడైయున్నాడు! దేవుడు నిన్ను కూడా, దీవించును గాక. ఆ

వెనుక దేవుడు నిన్ను దీవించును గాక. దేవుడు నిన్ను చూస్తున్నాడు. కేవలం లేచి నిలబడండి.

170 ఇట్లంటారు, "సహోదరుడా బ్రెన్హామ్, దీనివలన ఏమైనా ప్రయోజనం ఉందా?" నిశ్చయంగా. లేచి నిలబడి మరియు అది ఎంత వ్యత్యాసమును కలుగజేస్తుందో చూడండి.

171 మీ హృదయములో మీరు నిజంగా యథార్థంగా ఉన్నట్లైతే, దేవుడు కరుణా సంపన్నుడైయున్నాడు. "ఏ ఒక్కరూ నశించిపోవడం ఆయనకు ఇష్టము లేదు కానీ, అందరూ పశ్చాత్తాపపడాలని ఆయన కోరుతున్నాడు." దేవుడు తన కరుణయందు సంపన్నుడైయున్నాడు! ఓ దేవా, మా మీద కరుణ చూపించుము.

172 ఇప్పుడు ఆ ప్రార్థనా కార్డులను కలిగియున్నవారు, ఇప్పుడు ఇక్కడ ఎంతమంది ఉన్నారు? అవి ఏమిటి? A లు మరియు B లు, అవే కదా? A లు మరియు B లు. A ప్రార్థనా కార్డులు కలిగియున్న వారందరూ, *ఈ* వైపున నిలబడండి, మరియు B ప్రార్థనా కార్డు గలవారందరూ వారి వెనుక నిలబడతారు.

173 నాకు సహాయము చేయడానికి ఇష్టపడే సేవకులెవరైనా ఇక్కడ ఉన్నారేమోనని నేను ఆలోచిస్తున్నాను. వారు ఉన్నట్లైతే, ఇక్కడికి రాడానికి ఇష్టపడుతున్నట్లైతే, ఇక్కడ మీ——మీ సహకారమును పొందుకోడానికి నేను సంతోషిస్తాను, ఏలయనగా ప్రార్థించడానికి, మీతో కలిసి ప్రార్థించడానికి——ప్రార్థించడానికి మేము ఆనందిస్తాము.

174 ఇది, బైబిలు ఇట్లు చెప్పినది, "నమ్మినవారిని ఈ సూచకక్రియలు వెంబడిస్తాయి." అవును, అయ్యా. "నా నామమున వారు దయ్యములను వెళ్ళగొట్టుదురు, వారు క్రొత్త భాషలుతో మాట్లాడుదురు." మనం దానిని చేశామా? దేవుని కృప ద్వారా జరిగినది; అది మనము కాదు; కానీ తన మాటను నిలబెట్టుకోడానికి కరుణాసంపన్నుడైన దేవుడైయున్నాడు. దేవుడు!

175 ఇప్పుడు, ఆ చక్రాల కుర్చీలలో ఉన్నవారిని, మీరు వారిని సరిగ్గా క్రింద ఇక్కడ ముందు ఉంచగోరినట్లైతే; సరిగ్గా ఇక్కడే మేము వారి కొరకు ప్రార్థన చేస్తాము, వారిని దానిలోనుండి, ఆ మధ్య దారిలోనుండి తీసుకురావలసిన అవసరము లేదు. మంచిది, వారిని, నేరుగా ఇక్కడికే రానిద్దాము. మనము, మనలో ప్రతి యొక్కరము, నిశ్చయముగా దాని కొరకు ప్రార్థించుదాము. దేవుడు తన కరుణయందు సంపన్నుడైయున్నాడు!

176 ఇప్పుడు మీరు కొద్ది నిమిషాలు కుడి-ప్రక్కకు నిలబడతారా? సహోదరుడు బ్రౌన్ మీతో వచ్చాడా? ["రేపు వస్తాడు," అని ఒక సహోదరుడు చెప్తున్నాడు.——సంపా.] రేపు వస్తాడు. అతడు ఇక్కడ ఉంటాడని నేను——నేను——నేను ఆశపడ్డాను. ఎక్కడున్నాడు, సహోదరుడు ఔట్లా ఎక్కడున్నాడు, సహోదరుడు ఫుల్లర్ ఎక్కడున్నాడు? నేను మొట్టమొదట వచ్చినప్పుడు నాతో ఉన్న ఆ ప్రజలలో కొందరు, మనం తిరిగి వద్దాం. ఈ పాత-కాలపు ప్రార్థనా వరుసలు మీకు గుర్తున్నాయా, అప్పుడు మనం అక్కడ ఎంతోసేపు నిలబడేవారము, నేనెంతో నీరసమైపోయేవాణ్ణి, మీరు నన్ను ఒకరు ఒక ప్రక్కన ఇంకొకరు మరొక ప్రక్కన పట్టుకోవలసియుండేది జ్ఞాపకమున్నదా?

177 మీలో ఎంతమంది ఆ ప్రారంభ కూడికలలో ఉన్నారు? ఇక్కడ చూడండి. ఆ వెనుక మీకు గుర్తున్నదా, నేను యధార్థంగా ఉన్నట్లైతే, ఈ సంగతులు జరుగుతాయని, ప్రభువైన యేసు నాతో చెప్పాడని నేను మీతో చెప్పాను. అది నిజమేనా? మనకు ఆ రోజుల్లో అటువంటిది ఎన్నడూ లేదు. కానీ అది జరిగినది, ఎందుకంటే దేవుడు కరుణా సంపన్నుడైయున్నాడు, మరియు తన వాగ్దాన విషయంలో నమ్మకస్తుడైయున్నాడు. ఆమేన్! ఆపివేయడానికి ప్రయత్నిస్తున్నాను, మరి నా వల్లకావడంలేదు. ఆమేన్! దేవుడిని స్తుతించండి! "ఓ, నేను వారిలో ఒకడినైనందుకు నేను ఎంతగానో ఆనందిస్తున్నాను!" ఆమేన్. ఓ, మై!

దాదాపు ప్రతి చోట ఇట్టి ప్రజలు ఉన్నారు,
పెంతెకొస్తున వారి మీద కుమ్మరించబడి
వారిని కడిగి శుద్ధి చేసిన అగ్నితో,
వారి హృదయములు రగులుచున్నవి;
ఓ, ఇప్పుడు అది నా హృదయంలో మండుచున్నది,
ఓ, ఆయన నామమునకు మహిమ కలుగును గాక!
నేను వారిలో ఒకడినని చెప్పగలుగుటకు నేనెంతగానో
ఆనందిస్తున్నాను.

178 ఓ, నేను, నేను ఇదివరకు ఉన్న విధంగా, ఒక దౌర్భాగ్యుడైన, దిక్కుమాలినవాడైన, దయనీయమైన గ్రుడ్డివాడైన, దౌర్భాగ్యుడిగా ఉన్నాను; మరియు ఇప్పుడు ఆయన కనికరము ద్వారా, ఆయనయొక్క సంపన్నమైన కనికరము ద్వారా, దేవునిరాజ్యమును నేను చూడగలుగుతున్నాను. ఆమేన్. ఆయన ఆజ్ఞలు ఎంత రమ్యమైనవి కదా!

179 చంక కర్రను పట్టుకొనియున్న, నా సహోదరుడా, నిలబడు. నీవు పైకి లేవలేకపోతే, పర్వాలేదు, సరిగ్గా ఇక్కడే నిలబడు, మేమే నీ దగ్గరకు వచ్చి నీకు ప్రార్థన చేస్తాము.

180 ఇప్పుడు ప్రార్థనా కార్డులలో A లు మరియు B లు గలవారు, అక్కడ ఆ మరొక ప్రక్కన వరుస కట్టండి, మరియు మేము వారి కొరకు ప్రార్థించబోతున్నాము.

181 సేవక సహోదరులారా, రోగులపై చేతులుంచుటను మీరు నమ్మినట్లైతే, మీరు నిశ్చయంగా, మీరు నేరుగా ఇక్కడికి వచ్చి మరియు నాతోపాటు ఈ వేదిక మీద నిలబడండి. మనము రోగుల కొరకు ప్రార్థించబోతున్నాము.

182 ఇప్పుడు ఆ వరుసలో నిలబడిన మీతో చెప్తున్నాను, దేవుని సన్నిధి ఇక్కడ ఉన్నదని మీరు నమ్మగలిగితే చాలు, ఆయన ఏమి చేస్తానని చెప్పాడో సరిగ్గా దానినే చేస్తూ, పరిశుద్ధాత్మ ఇప్పుడు మన మధ్య ఉన్నాడని నమ్మగలిగితే చాలు. మిమ్మల్ని స్వస్థపరచడానికి నాకు శక్తి ఉన్నట్లైతే, నేను నిశ్చయంగా దానిని చేస్తాను. మిమ్మల్ని స్వస్థపరచడానికి ఏ మార్గమైనా నా దగ్గర ఉన్నట్లైతే, నేను నిశ్చయంగా దానిని చేస్తాను. నేను దానిని కలిగిలేను. నేను---దేవుడు ఒక చిన్న వరమును ఇచ్చాడు.

183 నేను అంత పెద్ద బోధకుడనేమీ కాదు. ఒక బోధకునిగా పరిగణించబడటానికి, ఈ రోజులలో బోధకుడని పిలువబడేదానికి చాలినంత విద్య నాకు లేదు, ఈ రోజుల్లో ఆ——ఆ అనుభవాలు తప్పక వేదపాండిత్య అనుభవములైయుండవలసి యున్నది, మరియు దానికి ఫలానా డాక్టర్ డిగ్రీ, మరియు మొదలగునవి

ఉండవలసియున్నది. నేను వాటికి అర్హుడిని కాలేను. కానీ దేవుడు, నా హృదయమును చూసి, మరియు నేను ఆయన కొరకు ఏదో ఒకటి చేయగోరుతున్నానని, నేను దానిని అభినందించగోరుతున్నానని ఎరిగియున్నాడు.

184 ఈ మధ్యనే ఒక వ్యక్తి నాతో ఇలా అంటున్నాడు, ఇట్లన్నాడు, "మిస్టర్. బ్రెన్హామ్, నీవు కేవలం ఒక మంచి వ్యక్తివని నేను అనుకుంటున్నాను, కానీ నీవు యధార్థంగా తప్పెయున్నావని నేను నమ్ముతున్నాను. నీవంతా ఆ చిత్తమునకు వెలుపల ఉన్నావు. అంతమున నీవు శిక్షించబడతావని నీకు తెలుసా?"

185 మరియు నేను ఇట్లన్నాను, "చూడు, నేను నీకు ఒకటి చెప్పాలనుకుంటున్నాను. కేవలం ఈ వాదన నిమిత్తం, నువ్వు——నువ్వు చెప్పిందే సరియని నేను అంటాను. నేను తప్పెనట్లైతే, మరి నేను——నేను తప్పని నేను నమ్మడంలేదు; కానీ నేను తప్పెనట్లైతే, మరియు ఒక వంద సంవత్సరాల వరకు నేను జీవించబోతున్నానని, మరియు మార్గాంతమున ఆయన నన్ను శిక్షించి, మరియు 'విలియమ్ బ్రెన్హామ్, నా పరలోకములోనికి రావడానికి నీవు అర్హుడవు కావు. వెలుపటి చీకటిలోనికి వెళ్ళు,' అని చెప్తాడని నాకు ఇప్పుడే తెలిసినా సరే, విషయం ఏమిటో తెలుసా? ఎలాగైనా, నేను వెళ్ళేవరకు నా జీవితంలోని ప్రతి రోజు నేను ఆయనను సేవిస్తాను. ఏలయనగా అర్హతలేకపోయినా నేను ఆయనయొక్క అమోఘమైన ఆశీర్వాదములను పొందుకున్నాను, ఎంతగా అంటే ఆయన నాకు జీవముకంటే ఎక్కువైపోయాడు. నేను అయ్యున్నదంతా ఆయనే..."

186 నేనేమైయున్నానో, నేనేమైయుండటానికి ఆశించగలనో, దానంతటినీ నేను ఆయన కృప మరియు కనికరముల నుండి పొందుకున్నాను. నేను దౌర్భాగ్యుడిగా, దిక్కుమాలినవాడిగా, దరిద్రుడిగా, గ్రుడ్డివాడిగా ఉన్నాను; కానీ కృప ద్వారా ఆయన నన్ను స్వస్థపరచాడు, మరియు దేవుని కృప ద్వారా, నేను బలంగా మరియు ఆరోగ్యముగా ఉన్నాను. నాకు మంచి కనుదృష్టి ఉన్నది. నేను తింటున్నాను, త్రాగుతున్నాను, నాకు అవసరమైయున్న ప్రతిదానిని కలిగియున్నాను. నా అవసరతలను మాత్రమే గానీ; నేను కోరుకున్నవాటిని ఇస్తానని ఆయన ఎన్నడూ వాగ్దానం చేయలేదు.

187 మరియు ఆ దినమున నేను త్రోసివేయబడితే, మరియు నేను ఎరిగియున్నట్లైతే...నేను ఎక్కడుంటానో నేను చూడలేను. కానీ నేను తప్పెయున్నానని నేను ఎరిగియున్నట్లైతే, మరియు నేను తప్పెయుండుటకు దేవుడు నన్ను ఎన్నుకున్నట్లైతే, నేను తప్పుగానే ఉండగోరుతాను, మరి అది నేను ఆయన చిత్తమును చేయగోరుతున్నాను గనుకనైయున్నది. అది, ఆయన చిత్తమే నెరవేరుటను కోరుకునేంతగా నేను ఆయనను ప్రేమిస్తున్నాను. ఇప్పుడు, అది ఒక పెద్ద మాటయైయున్నది, అయితే నేను దానిని ఏ ఆత్మలో చెప్పానో, అదే ఆత్మలో మీరు దానిని గ్రహిస్తారని నేను ఆశిస్తున్నాను. చూడండి, నేను ఆయన చిత్తమును చేయగోరుతున్నాను. ఎప్పుడైనా నేను ఆయనను ఏదైనా అడిగితే, ఆయన "వద్దు" అని తల ఊపుతాడు, ఆయన "సరే" అని చెప్పినప్పుడు నేను ఎంత సంతోషిస్తానో నేను అప్పుడు కూడా అంతే సంతోషిస్తాను. ఎందుకంటే, మనమెల్లప్పుడూ, "నీ చిత్తము నెరవేరును గాక" అని అడుగవలసియున్నాము. ఆయన కాదు అని చెప్పినవి కేవలం...అది ఆయన చిత్తమైతే, అది కేవలం...అవి ఆయన సరే అని

చెప్పినవాటి కంటే ఎంతో శ్రేష్ఠమైనవి, దానిని చేయడం ఆయన చిత్తమైనప్పుడు అలాగుంటుంది. అప్పుడే మీరు ఆయనను నిజంగా ప్రేమిస్తున్నారు. ఆమేన్.

188 నేను ఆయన గురించి మాట్లాడటం మొదలుపెడితే, నేను అసలు ఆపలేను. ఓ, ఆయన ఎంతో వాస్తవమైయున్నాడు, నాకు ఎంతో వాస్తవమైనవాడిగా ఉన్నాడు! స్నేహితులారా, నేను ఏమైయున్నానో అదంతా ఆయనే—ఆయనేయైయున్నాడు, నేను ఏమైయుండగలనో, నేను ఏమైయుండాలని ఎదురుచూస్తున్నానో అదంతా, యేసుక్రీస్తులో, ఆయనయొక్క వాక్యములో స్థిరపరచబడియున్నది.

189 వర్తమానము నిమిత్తము, పరిశుద్ధాత్మయొక్క సాక్ష్యమును బట్టి ఈ రాత్రి నేను కృతజ్ఞుడనైయున్నాను. బహుశా అది, దానితో కొందరు ఏకీభవించకపోవచ్చని నాకు తెలుసు, కానీ నేను మీతో చెప్పినట్లుగా, నేను ఒక వర్తమానమునకు బద్ధుడనైయున్నాను. ఒక సూచన బయలువెళ్ళినది, మరియు కేవలం ఆయన దేవుడైయున్నాడని చూపించడానికి దేవుడు ఒక సూచనను పంపడు. ఒక సూచనను ఎల్లప్పుడూ ఒక వర్తమానము, ఒక స్వరము వెంబడిస్తుంది. అది ఎవరికైనా తెలుసు.

190 యేసు సూచకక్రియలతోను మహాత్కార్యములతోను వచ్చాడు. ఆయన సూచకక్రియలను మరియు అద్భుతాలను చేస్తున్నప్పుడు ఆయన ఒక గొప్ప వ్యక్తిగా ఉన్నాడు, కానీ ఆయన కూర్చొని మరియు ఒక వర్తమానమును తీసుకురావడం మొదలుపెట్టినప్పుడు, "నేను మరియు నా తండ్రి ఒక్కటైయున్నాము" అని చెప్పినప్పుడు, ఓ, మై, అప్పుడది వారికి తప్పు అనిపించినది. చూశారా? అయితే సూచనను స్వరము వెంబడించవలసియున్నది.

191 మోషేకు రెండు సూచనలు ఇవ్వబడినవి, మరియు ప్రతి సూచన ఒక స్వరమును కలిగియున్నది. అది నిజము. ఇక్కడ కొంతకాలం క్రితం, ఎక్కడో, నేను దాని మీద, సూచనయొక్క స్వరము అనే దానిమీద ప్రసంగించాను. ఆ సూచనకు ఒక—ఒక స్వరము తప్పక ఉండవలసియున్నది. అది మారుతూ ఉంటుంది. అది ఎల్లప్పుడూ ఆ విధంగానే జరుగుతుంది. అది ఆ విధంగా కాకపోతే, అప్పుడది దేవుని యొద్దనుండి రాలేదు.

192 బైబిలు గ్రంథములో సత్యమని కనుగొనబడినట్టి, ఒక వింతైన ప్రత్యేకమైన పరిచర్యతో ఒక మనిషి బయటకు వచ్చి, మరియు ఆ మనిషి ఇంకను సరిగ్గా అదే పాత సంఘశాఖ సిద్ధాంతముతో నిలిచియున్నట్లైతే, దానిని మర్చిపోండి. దానిలో ఏమీ లేదు! దేవుడు అటువంటి ఒక కార్యమును చేయడు. ఆ విషయము, అది చెదలతో, లేదా తోక పురుగులతో, లేదా మీరు వాటిని ఏమంటారో అట్టివాటితో నిండియున్న కుళ్ళిపోయిన మన్నా అయ్యున్నది, నలభై, యాభై సంవత్సరాల క్రితపు మన్నాయైయున్నది, సంవత్సరాల క్రితం కురిసిన ఆ పాత మన్నాను ఇంకను తినడానికి ప్రయత్నిస్తున్నారు. మరియు ఇశ్రాయేలీయులు, వారి ప్రయాణంలో ఉన్నప్పుడు, ప్రతీ రాత్రి నూతన మన్నా కురిసినది. అది నిజము, మీరు దానిని నిలువచేయకూడదు.

193 గతించిపోయిన ఏదో కాలం ద్వారా మనం బ్రతుకలేము. మన యాత్రలో మనం ప్రయాణం చేస్తుండగా, పరలోకము నుండి కురిసిన నూతనమైన, తాజా

మన్నాను మనం భుజిస్తున్నాము.

ఇప్పుడు మనం మన తలలు వంచుకుందాము.

194 ప్రభువైన దేవా, నీవు ఎంతో వాస్తవమైనవాడవు, నీ సన్నిధి వాస్తవమైనది. ప్రభువా, నేను కృపను గూర్చి ఆలోచిస్తున్నాను. నీవు అనేక సంగతులను చేయడాన్ని ఇప్పుడే మేము—మేము చూశాము! నీ ప్రజల ద్వారా, నీవు భాషలతో మాట్లాడటాన్ని మేము విన్నాము, నీవు వాటిని అనువదించడాన్ని చూశాము. ఓ దేవా, నీవు వ్యాధిగ్రస్తులను స్వస్థపరచడాన్ని, గ్రుడ్డివారి కన్నులను తెరవడాన్ని, కుంటివారిని నడుచునట్లు, చెవిటివారిని వినగలుగునట్లు, మూగవారిని మాట్లాడునట్లు చేయడాన్ని చూస్తుండగా, నీవెంత గొప్ప బలిష్ఠుడవైన దేవుడవైయున్నావో!

195 మరియు పిదప ఈ అంత్యదినములలో నీవు దీనిని వాగ్దానం చేశావని చూస్తున్నాము, మాకు అనేక శరీరసంబంధమైన అనుకరణలు ఉన్నప్పటికినీ, మరైనను అది కేవలం, ఎక్కడో ఒక చోట, ఒక్క నిజమైన దేవుడు ఉన్నాడని, ఆయన నిజంగా సత్యమైయున్నాడని తెలియజేస్తుంది. మరియు పరలోకపు తండ్రీ, నీవు ఇక్కడ ఉన్నావని మేము చూసేంతగా, మేము దైవ-స్పర్శను కలిగియున్నవారము అవ్వాలని, ఈ రాత్రి నేను ప్రార్థిస్తున్నాను.

196 మరియు వరుసలో ఉన్న ఈ ప్రజలు, వారు ఈ వరుసలోనుండి వెళ్తున్నప్పుడు, ప్రభువా...మరి మేము వారికి ఒక వాగ్దానము చేశాము గనుక, మేము దీనిని చేస్తున్నాము. మరియు, "నమ్మినవారిని ఈ సూచకక్రియలు వెంబడిస్తాయి" అని నీవు చెప్పావు.

197 ఇక్కడ దైవసేవకులైన సహోదరులు నిలబడియున్నారు, వారు ఈ రాత్రి ఏమైయున్నారో ఆ విధంగా ఉండుటకు, జగత్తుపునాది వేయబడకముందే, నీవు ఎన్నుకున్న పురుషులైయున్నారు. నీవు పరిమితులు లేనివాడవు గనుక, ఒక ప్రపంచమనేది లేకముందే, ఈ రాత్రి మేము ఇక్కడ నిలబడియుంటామని, నీవు ఎరిగియున్నావు.

198 కాబట్టి, పరలోకపు తండ్రీ, ఈ రాత్రి, వ్యాధిగ్రస్తులైన ఈ ప్రజలు, అంగవైకల్యము గలవారు, గ్రుడ్డివారు, కుంటివారు, క్యాన్సరుతో-కొట్టబడినవారు, ఈ వరుసలోనుండి వెళ్ళేవారు, ఎవరైనా గానీ, వారు కేవలం దానిని అంగీకరించినట్లైతే, కేవలం చూసి మరియు గ్రహించినట్లైతే, హృదయ రహస్యమును ఎరిగియున్న అదే దేవుడు వారిని స్వస్థపరుస్తాడని వారు గ్రహించుదురు గాక.

199 కేవలం ఒక...ఒక ఇత్తడి ముక్కలాగా ఆ ఇత్తడి సర్పాన్ని చూసిన మనుష్యుడు, అతడు ఎన్నడూ స్వస్థత పొందడు, ఎందుకంటే అదేమైయున్నది అనేదానిని గూర్చిన గ్రహింపు అతనికి లేదు.

200 మరియు ఈనాడు, ప్రభువా, అది ఆ విధంగానే ఉన్నది. వారు ఒక వరమును చూస్తూ, అదే వారికి సహాయం చేయగలదని అనుకున్నట్లైతే, వారు గ్రహింపును కలిగిలేరు. స్వస్థపరచడానికి ఇక్కడున్నటువంటి దేవుని సన్నిధియొక్క నిర్ధారణ పైనే అది ఆధారపడియున్నది. తండ్రీ, దానిని అనుగ్రహించుము. యేసు నామములో, అది జరిగించబడును గాక. ఆమేన్.

201 ఆ పియానో వాయించే వ్యక్తి, ఆమె గనుక, అది పురుషుడైనా లేదా స్త్రీయైనా, అది ఎవరైనాగాని, తాము అక్కడికి వెళ్ళి మరియు ఈ పాటను వాయించాలని నేను కోరుతున్నాను, "గొప్ప వైద్యుడు, ఆ దయగల యేసు ఇప్పుడు సమీపమున ఉన్నాడు," ఆ పియానో వాయించేవారు ఎక్కడున్నా సరే, ఆమె వాయిస్తే బాగుంటుంది. ఇప్పుడు అది...

202 ఇండియానా, ఫోర్ట్ వేన్ లో జరిగిన నా మొదటి స్వస్థతా కూడికలలో ఒకటి నాకు గుర్తున్నది. ఒక చిన్న ఆమిష్ అమ్మాయి కూర్చొని, ఆ పియానో మీద, "గొప్ప వైద్యుడు, ఆ దయగల యేసు ఇప్పుడు సమీపమున ఉన్నాడు" అనే పాటను వాయిస్తున్నది. వేదిక మీద నా దగ్గరకు ఒక చిన్న బిడ్డ తీసుకురాబడినది, ఆ బిడ్డ అంగవైకల్యముతో ఉన్నది. మరియు నేను ఆ బిడ్డ కొరకు ప్రార్థిస్తూ ఉండగా, ఆ బిడ్డ నా చేతుల్లో నుండి దూకి మరియు వేదిక మీద నుండి క్రిందికి పరుగెత్తుకుంటూ వెళ్ళినది. ఆ తల్లి స్పృహకోల్పోయినది. వాళ్ళ అమ్మమ్మ తన చేతిరుమాలును ఎగరవేసి, ఏడ్వడం మొదలుపెట్టినది.

203 మరియు ఇప్పుడు ఈ చిన్న ఆమిష్ అమ్మాయికి, పెంతెకొస్తువారి గురించి ఏమియు తెలియదు, ఎందుకంటే ఆమె ఆమిష్ సంఘానికి చెందినది; అయితే ఆమె వాయిస్తూ ఉన్నది. ఆమె పొడవైన తలవెంట్రుకలు క్రిందికి వ్రేలాడినవి; ఆమె ఆత్మవశురాలై అన్యభాషలలో పాడటం మొదలుపెట్టింది, మరియు...మరియు ఆ పాటయొక్క రాగములోనే పాడింది. మరియు ఆ పియానో బటన్లు పైకి-మరియు-క్రిందికి కదలుతూ, "గొప్ప వైద్యుడు, ఆ దయగల యేసు ఇప్పుడు సమీపమున ఉన్నాడు" అనే పాటను వాయిస్తూ ఉన్నవి. ఆమేన్! ఆయన నిన్నా, నేడు, మరియు నిరంతరము ఒక్కటేరీతిగా ఉన్నాడు.

204 ఇప్పుడు మనము ప్రార్థించుకుందాము...ఇప్పుడు బయట అక్కడున్న ప్రతీ ఒక్కరూ ప్రార్థించండి. వరుసలో వస్తున్న మీరు, మా చేతులను మీ పైన పెట్టినప్పుడు, గుర్తుంచుకోండి, "నీవు దానిని నమ్మినట్లైతే, నీవు బాగవుతావు," అని యేసు చెప్పాడు. మీరు దానిని నమ్ముతున్నారా? ఇప్పుడు మనమంతా పాడుదాము.

ఆ గొప్ప వైద్యుడు ఇప్పుడు సమీపమున ఉన్నాడు,
ఆ దయగల యేసు;
ఆయన మాట్లాడుతాడు...

ఇప్పుడు మనము పాడుతుండగా మన కన్నులను మూసుకుందాం.

...హృదయములకు ఉల్లాసాన్ని కలుగజేస్తాడు,
ఓ, యేసు స్వరాన్ని వినండి.

అది సెరాపు పాటలో అతి మధురమైన స్వరము,
మర్త్యుల నోట అతి మధురమైన నామము;
అతి మధురమైన...(తండ్రియైన దేవా, ఇప్పుడు ప్రజల మీదకు కదలాడుము)...పాట,
ఓ యేసు, ఆశీర్వాదకరమైన యేసు.

ఆ గొప్ప...

205 ఇప్పుడు మీరు వస్తుండగా, ఆయన ఇక్కడ ఉన్నాడు. నా మాటను తీసుకోండి, లేదా మీయంతటట మీరే దానిని నమ్మండి, ఆయన ఇక్కడ ఉన్నాడు. బయట అక్కడున్నవారందరూ ఇప్పుడు ఈ ప్రజల కొరకు ప్రార్థించండి. [సహోదరుడు బ్రెన్హామ్ గారు రోగుల కొరకు ప్రార్థిస్తున్నాడు, సహోదరుడు బోర్డర్స్ గొప్ప వైద్యుడు అనే పాటను పాడటం కొనసాగిస్తున్నాడు. టేపులో ఖాళీగా ఉన్నది—సంపా.]

ఓ ప్రభువా, నేను నమ్ముతున్నాను, ఓ ప్రభువా, నేను
నమ్ముతున్నాను;
సమస్తము సాధ్యమే, ఓ ప్రభువా, నేను నమ్ముతున్నాను.

206 నమ్ముతున్నవారందరూ, మీ చేతిని ఈ విధంగా పైకెత్తి, "నేను నమ్ముతున్నాను" అని చెప్పండి. [సంఘము, "నేను నమ్ముతున్నాను" అని చెప్తున్నది—సంపా.]

207 ఇక్కడ ఒక వ్యక్తి కూర్చొనియున్నాడు. నేను పొడిగించి మాట్లాడటానికి కారణం; అతడే, అతడు క్యాన్సరుతో మరణిస్తున్నాడు. అతడు ఈ చంకకర్రపై ఆధారపడియున్నాడు. దేవునికి వెలుపల, ఆ వ్యక్తి బ్రతకడానికి లోకములో ఏ మార్గము లేదు. అతని ప్రేగులు మొత్తం క్యాన్సరుతో నిండియున్నవి, మరియు దేవుని కరుణ గనుక లేనట్లైతే అతడు చనిపోబోతున్నాడు. మరియు నేను కోరుతున్నదేమిటంటే నేను కేవలం...[టేపులో ఖాళీ ఉన్నది—సంపా.]...ఈ వ్యక్తికి ఒక ప్రోత్సాహకరమైన మాటను చెప్పగోరుతున్నాను.

208 నీవు, వైద్యులు ఇప్పుడు నీ కొరకు ఏమీ చేయలేరని నీకు తెలుసు. నీవు ఆ స్థితిని దాటియున్నావు, చూడు. మరియు నీవు...నీకు ఒకేఒక్క అవకాశం ఉన్నది, మరియు అది క్రీస్తులో మాత్రమేయైయున్నది, చూడు. మరియు, సహోదరుడా, నీవు...ఏదో ఒక రోజు, నేను కూడా చనిపోతాను. యేసు ఆలస్యము చేసినట్లైతే, మనం వెళ్ళవలసియుంటుంది. నేను నిన్ను అక్కడ కలిసి, అక్కడ న్యాయతీర్పు వద్ద నిలబడవలసియుంటుంది. మరియు ఈ రాత్రి...

209 మీకు తెలుసా, టెలివిజన్ లో వలె ఉన్నది, మనం మన వ్రేలును కదలించినా, ఏది చేసినా, ప్రతీసారి అది రికార్డు చేయబడుతుందని టెలివిజన్ తెలియజేసినది. మనము మాట్లాడే ప్రతీ మాట, రికార్డు చేయబడుతున్నది. ఇప్పుడు, చూడండి, టెలివిజన్ దానిని ఋజువు చేసినది. ఇప్పుడు, టెలివిజన్ ఒక చిత్రమును ఉత్పత్తిచేయదు, అది కేవలం ఆ తరంగమును టెలివిజన్ లోనికి ప్రసారం చేస్తుంది. చూడండి, అది దానిని తయారు చేయదు. ఆదాము భూమి మీద నడచినప్పుడు టెలివిజన్ ఉన్నది, మోషే ఎర్ర సముద్రముగుండా వచ్చినప్పుడు టెలివిజన్ అక్కడున్నది, ఏలీయా కర్మేలు పర్వతం మీద ఉన్నప్పుడు టెలివిజన్ ఉన్నది, చూడండి, కానీ వారు ఇప్పుడు మాత్రమే దానిని కనుగొన్నారు. చూశారా? మరియు ఇప్పుడు అంతటా నేను...

210 మనము చేసే ప్రతీ కదలిక, మరియు ప్రతీ శబ్దము రికార్డు చేయబడి, తీర్పు దినమున మనకు ఎదురవుతుంది. మనం చేసే ప్రతి కదలిక అక్కడ మనకు ఎదురవ్వవలసియున్నది. ఒక సేవకుడిగా, నేను మీతో చెప్పే మాటలకు నేను జవాబు చెప్పవలసియుంటుంది. నేను దానిని చేయవలసియున్నాను, ఎందుకంటే దాని విషయంలో దేవుడు నన్ను బాధ్యునిగా ఎంచుతాడు.

211 ఇప్పుడు నేను చేయగలిగితే, నేను నిన్ను బాగుచేసేవాణ్ణి; ఎందుకంటే దేవుడు జోక్యం చేసుకోకపోతే, నీకు ఇక కొద్ది సమయమే ఉన్నది. ఇప్పుడు, నేను దిగివచ్చి మరియు నీ కొరకు ప్రార్థించాను, నాకు తెలిసినంతవరకు నేను చేయగలిగినదంతా చేశాను. సహోదరుడా, అక్కడ ఆ స్థితిలో కూర్చొనియున్న ఒక వ్యక్తి కొరకు ప్రపంచంలో నేను చేయగలిగినది ఏదైనా ఉందంటే, నేను దానిని చేస్తాను.

212 మరియు నిన్ను అడుగనివ్వు, చూడండి. నీవు——నీవు——నీవు ఇదివరకే స్వస్థపరచబడ్డావు, ఎందుకంటే నీవు స్వస్థపరచబడ్డావని యేసు చెప్పాడు. చూడండి, "ఆయన పొందిన దెబ్బలచేత మనము స్వస్థపరచబడ్డాము." ఇప్పుడు నీవు గనుక, నీ హృదయ అంతరంగమునుండి, దానిని అంగీకరించగలిగితే, నీవు ఇప్పుడు మరణించావు గానీ, నీవు బ్రతుకుతావు.

213 ఇప్పుడు, చూడండి, ఇప్పుడు టెలివిజన్ ఈ గది గుండా వెళ్తున్నదని మనకు తెలుసు. మనకు అది తెలుసు. మనకు అది కనబడటంలేదు. మనము దానిని చూడలేము, మన కన్నులు ఆ విధంగా చేయబడలేదు, మన ఇంద్రియములు దానిని పట్టుకోలేవు. దాని పట్టుకోడానికి, తయారు చేయబడిన ఒక గొట్టము, లేదా అదేమైయున్నదో అది, ఆ క్రిస్టల్ అవసరమవుతుంది.

214 ఆ విధంగానే దేవుడు కూడా ఇక్కడున్నాడు. మనకు ఆయన కనబడటంలేదు, కానీ ఆయన ఇక్కడ ఉన్నాడని మనకు తెలుసు. యేసుక్రీస్తు ఒక్కటేరీతిగా ఉన్నాడు. చూడండి, ఆయన తనను తాను ఏ విధంగా తెలియజేసుకుంటాడనేది, ఆయన ఇప్పుడే వెల్లడిచేసుకున్నాడు. ఇప్పుడు, స్వస్థత విషయం మట్టుకైతే, ఆయన సరిగ్గా ఇప్పుడు ఇక్కడ నిలబడియున్నట్లైతే, ఆయన మీ కొరకు ఇంకేమియు చేయలేడు, చూడండి, ఇంకొక్క విషయమును కూడా చేయలేడు. దేవుని కుమారుడు గనుక సరిగ్గా ఇక్కడ నిలబడియున్నట్లైతే, మరి ఆయన ఇక్కడే ఉన్నాడు, ఆయన ఇక్కడ ఉన్నాడు, కానీ ఆయన మీ కొరకు ఇంకేమియు చేయలేడు, ఎందుకంటే ఆయన ముందుగానే ఇక్కడ తనను తాను గుర్తింపజేసుకున్నాడు. చూశారా? మరియు సరిగ్గా అదే విధంగా, మిమ్మల్ని స్వస్థపరచడానికి మరియు మిమ్మల్ని బాగుచేయడానికి, ఆయన సరిగ్గా ఇప్పుడు ఇక్కడ ఉన్నాడు.

215 మరియు అక్కడ ఆ చిన్న స్త్రీ నాతో ఇట్లు చెప్పినది, ఇట్లన్నది, ఆమె మీదుగా, "నీవు ఆశీర్వాదమును అడిగావు, మరియు ప్రవచించావు లేక మరేదో చెప్పావు," ఆ చక్రాల కుర్చీలో కూర్చొన్న ఆమె, ఒక బిడ్డను కనబోవుచున్నదని చెప్పావు. మరియు ఆమె, ఆమె తన బిడ్డను పొందుకున్నది.

216 మరియు ఇప్పుడు ఇక్కడ కూర్చొనియున్న చిన్న స్త్రీ. ఇప్పుడు ఆమెకు గొంతుక శస్త్రచికిత్స జరిగినది, మరియు అది ఆమెకు పక్షవాతమును కలుగజేసింది. మంచిది, అటువంటివి చాలా జరగడాన్ని మనము చూస్తుంటాము. ఇప్పుడు, చిన్న, సహోదరీ, నీవు ఒక అసలైన క్రైస్తవురాలవని నాకు తెలుసు. దేవుడు నిన్ను ఆ విధంగా ఎందుకు ఉండనిచ్చాడో, నాకు తెలియదు. అది ఎందుకని నేను అనుకుంటున్నానంటే, బహుశా, నీవు-\-\-విశ్వాసము, నీవు——నీవు అక్కడ నుండి బయటకు రావడానికి, విశ్వాసమును కలిగియుండడానికి ప్రయత్నిస్తున్నావు, చూడు; అయితే ఇప్పుడు చూడు, మనము దానిని కలిగియుండటానికి ప్రయత్నించడం కాదు, ఇప్పుడు మనం దానిని కలిగియుందాము, చూడండి,

మనం——మనం అక్కడ ఉండబోతున్నాము. దానిలోని విషయమంతా అదేయైయున్నది, సరిగ్గా ఇప్పుడే అది మొదలవ్వబోతుంది, మరియు మనం బాగవ్వబోతున్నాము. మరియు బయట అక్కడ ఆ కుర్చీలలో ఉన్న మీరు, ఏమిటి, లేదా——లేదా మీరెక్కడున్నా గానీ, క్రీస్తు మనమధ్య ఉన్నాడని మాత్రం గుర్తుంచుకోండి.

217 ఇప్పుడు, మీరు ఇట్లంటారు, "ఎవరైనా ఉన్నారా…? నా దృశ్యము కూడా రావడాన్ని నీవు చూస్తున్నావా?" ఓ, అవును.

218 చివరికి యేసుక్రీస్తు, ఆయన ఇక్కడ భూమి మీద ఉన్నప్పుడు ఆయన పలికిన మాటలు కూడా, సరిగ్గా ఈ గదిలో నుండి వెళ్తున్నవి. అవి ఎన్నడూ మరణించవు. విజ్ఞానశాస్త్ర ప్రకారంగా అది సత్యమని ఎంతమందికి తెలుసు? మంచిది, అది ఏమిటి? పిదప ఆత్మ వ్రాయబడిన ఆ మాటను తీసుకొని, మరియు దానిని కార్యరూపణ చేస్తుంది. ఓ, మహిమ!

219 ఆయన ఇక్కడ ఉన్నాడు. ఆయన, ఆ ప్రభువు సరిగ్గా ఇప్పుడు ఇక్కడ ఉన్నాడు. మనము కేవలం…మనమెంతో చూశాము, ఆయన ఎంతో జరిగించాడు, ఎంతగా అంటే మనము కేవలం, మీకు తెలుసు కదా, మనం దాని మీదుగా తొట్రిల్లుతాము. మనం గనుక గ్రహించగలిగితే చాలు, ఏదో ఒక కల్పితమైనది కాదు, ఏదో ఒక వేదాంత పరమైన పదము కాదు; కానీ ఆయన ఈ దినమున తననుతాను కనబరచుకుంటాడని ఆయన వాగ్దానం చేశాడనుటకు నిర్ధారణ, ఇదిగో సరిగ్గా ఇక్కడ సరిగ్గా ఇప్పుడు మన ఎదుట దానిని వెల్లడిచేస్తూ ఆయన ఇక్కడ ఉన్నాడు. ఎటువంటి ఒక అద్భుతమైన విషయము! అది అద్భుతమైనది కాదా?

220 ఇప్పుడు నీవు నమ్ముతున్నావా. నీవు దానిని నమ్ముతున్నావా? నీవు మరణించబోవడంలేదని నమ్ము. నీవు బ్రతుకబోతున్నావు, మరియు నీవు దేవుడిని ఘనపరచబోతున్నావు. నీవు దేవుడిని ఘనపరచబోతున్నావు. నీవు ఎన్నడైనా బాప్తిస్మము పొందావా? నీవు ఒక క్రైస్తవుడవు, కాదా? మరియు నీవు ఒక క్రైస్తవుడవు. మంచిది, నీవు దేవునియొక్క ఘనత కొరకు జీవించగోరుతున్నావు. అలాగైతే వెళ్ళి, బ్రతుకు, నా సహోదరుడా. యేసుక్రీస్తు నామములో, బ్రతుకు!

221 మరియు, సహోదరీ, దేవుని మహిమ కొరకు నీవు నడువాలనుకుంటున్నావా, మరియు నీ బిడ్డను చూసుకొనగోరుతున్నావా; అలాగైతే సహోదరీ, యేసుక్రీస్తు నామములో, నడువుము!

222 మీరు, మీలో ప్రతి ఒక్కరూ, యేసుక్రీస్తు నామములో, అలాగే చేయండి! ఈ రాత్రి ఇక్కడున్న ఈ వెస్ట్ వర్డ్ హో హోటల్ ను మర్చిపోకండి, దేవుని సన్నిధి ఇక్కడ గుర్తించబడినది. ఆయన పక్షపాతి కాడు. ఆయన కేవలం మీరు నమ్మాలని కోరుతున్నాడు. ఇప్పుడు మీరు ఆయనను నమ్ముతున్నారా? ఆమేన్. దేవుడు మిమ్మల్ని దీవించును గాక.

223 ఇప్పుడు మనము మన తలలు వంచుకుందాము. వీడ్కోలు చెప్పడానికి వారు ఎవరిని ఎన్నుకున్నారో, నాకు తెలియదు. సహోదరుడు ముషేగియన్ ఇక్కడున్నాడు, సహోదరుడా, నేరుగా ఇక్కడికి రండి. అతడు ప్రార్థనతో వీడ్కోలు ఇస్తాడు. దేవుడు మిమ్మల్ని దీవించును గాక.

65-0119 కరుణా సంపన్నుడైన దేవుడు
వెస్ట్ వార్డ్ హో హోటల్
ఫీనిక్స్, ఆరిజోనా అమెరికా

TELUGU

©2026 VGR, ALL RIGHTS RESERVED

VOICE OF GOD RECORDINGS, INDIA OFFICE
19 (NEW NO: 28) SHENOY ROAD, NUNGAMBAKKAM
CHENNAI 600 034, INDIA
044 28274560 • 044 28251791
india@vgroffice.org

VOICE OF GOD RECORDINGS
P.O. BOX 950, JEFFERSONVILLE, INDIANA 47131 U.S.A.
www.branham.org

కాపిరైట్ గమనిక

సర్వహక్కులు మావి. యేసుక్రీస్తు యొక్క సువార్తను వ్యాప్తిచేయు ఒక సాధనముగా, వ్యక్తిగత ఉపయుక్తము కొరకు ఉచితముగా పంచిపెట్టుట కొరకు హో ప్రింటర్ మీద ఈ పుస్తకమును ముద్రించవచ్చును. ఈ పుస్తకము అమ్మకూడదు. అమితముగా ప్రత్యుత్పత్తి చేయకూడదు. వెబ్ సైట్ లో పెట్టకూడదు. మరలాపొందుకొనుటకు రిట్రైవల్ సిస్టంలో ఉంచకూడదు. ఇతర భాషలలోకి తర్జుమాచేయకూడదు, లేక వాయిస్ ఆఫ్ గాడ్ రికార్డింగ్స్ వారి వ్రాతపూర్వకమైన అనుమతి తెలియబడకుండ నిధులు సేకరించుటకు ఉపయోగించ కూడదు.

మరింత సమాచారము కొరకు లేక యితరత్రా పరికరముల కొరకు దయచేసి సంప్రదించగలరు:

VOICE OF GOD RECORDINGS, INDIA OFFICE
19 (NEW NO: 28) SHENOY ROAD, NUNGAMBAKKAM
CHENNAI 600 034, INDIA
044 28274560 • 044 28251791
india@vgroffice.org

VOICE OF GOD RECORDINGS
P.O. BOX 950, JEFFERSONVILLE, INDIANA 47131 U.S.A.
www.branham.org